Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 287 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 నవంబర్ 2023 శనివారం

## లక్ష్మణ రేఖ దాటినవారికి నోటీసులు తథ్యం

**- కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ హెచ్చరిక**

బెంగళూరు : అధిష్టానం స్పష్టమైన సూచనలు చేసినప్పటికీ బహిరంగ వేదికలపై రకరకాల వ్యాఖ్యలు చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందికరమైన వాతావరణం సృష్టిస్తున్న నేతలందరికీ నోటీసులు జారీ చేయనున్నట్లు కేపీసీసీ అధ్యక్షుడు కూడా అయిన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. హుబ్బళ్లిలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ఐదేళ్లు పాలించేందుకు కాంగ్రెస్‌కు అధికారమిచ్చారని, ముఖ్యమంత్రి, మంత్రులుగా ఎవరు ఉండాలనో అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. అధిష్టానం సూచన మేరకు రాష్ట్రంలో సిద్దరామయ్య నాయకత్వంలోని ప్రభుత్వం పగ్గాలు చేపట్టిందని తెలిపారు. ఐదేళ్లు తానే సీఎం అంటూ సిద్దరామయ్య చేసిన ప్రకటనపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు. ఒక క్రమశిక్షణ కల్గిన కార్యకర్తగా పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా మాట్లాడబోనని అన్నారు.

# చావో రేవో తేల్చుకునేందుకు

# కాంగ్రెస్ స్పెషల్ డ్రైవ్ షురూ!




హైదరాబాద్ : రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ స్పెషల్ డ్రైవ్ చేస్తున్నట్లు సమాచారం. ఈ స్పెషల్ డ్రైవ్ ఎందుకంటే ప్రత్యర్థి పార్టీల్లోని ప్రముఖ నేతలను ఆకర్షించేందుకే. బీజేపీలోని సీనియర్ నేత వివేక్ వెంకటస్వామి రెండురోజుల క్రితం కాంగ్రెస్ లో చేరటం ఇందులో భాగమనే అనుకోవాలి. వివేక్ తో ఆగకుండా మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, విజయశాంతితో కూడా హస్తంపార్టీ నేతలు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. బీఆర్ఎస్, బీజేపీల్లోని కీలక నేతలు, ద్వితీయశ్రేణి నేతలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టిపెట్టినట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఇతర పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరితే పార్టీకి బాగా హైప్ వస్తుందని సీనియర్ నేతలు నమ్ముతున్నారు. వారంరోజుల పాటు ఇతర పార్టీల్లోని నేతలను చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ స్పెషల్ డ్రైవ్ మొదలుపెట్టబోతోందట. ఈ స్పెషల్ డ్రైవ్ గనుక సక్సెస్ అయితే ఇదే ఊపు ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించటం ఖాయమని హస్తంపార్టీ నమ్ముతోంది. స్పెషల్ డ్రైవ్ కారణంగా ఏమవుతుందంటే ఇప్పటివరకు ఊగిసలాటలో ఉన్న నేతలంతా గట్టి నిర్ణయం తీసుకుని కాంగ్రెస్ లో చేరటం ఖాయమని అనుకుంటున్నారు సీనియర్ నేతలు. ఇప్పటికిప్పుడు ఇలా చేరిన వారికి అందరికీ టికెట్లు ఇవ్వలేకపోవచ్చు. అందుకనే ఇపుడు స్పెషల్ డ్రైవ్ లో చేర్చుకోవాలని అనుకుంటున్న సీనియర్ నేతల్లో ఎక్కువమందిని ఎంపీ ఎన్నికలకు అభ్యర్థులుగా రెడీ చేయబోతోందని సమాచారం. పార్టీ అధికారంలోకి రాగానే మిగిలిన నేతలకు ఇచ్చిన హామీలకు తగ్గట్లుగా నెరవేర్చాలని కూడా డిసైడ్ అయ్యింది. ఇదంతా చూస్తుంటే ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పకడ్బందీగా ఎంతటి గ్రౌండ్ వర్క్ చేస్తోందో అర్ధమవుతోంది. విషయం ఏమిటంటే రాబోయే ఎన్నికల్లో గనుక అధికారంలోకి రాకపోతే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు కష్టమనే అనుకోవాలి. ఎందుకంటే 15 ఏళ్ళు అధికారంలో ఉండకపోతే పార్టీ జవసత్వాలన్నీ కోల్పోవటం ఖాయం. ఇపుడు కాంగ్రెస్ పరిస్థితి దాదాపు ఇలాగే ఉంది. అందుకనే చావో రేవో అన్నట్లుగా సీనియర్లంతా ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేస్తున్నది. మరి ఈ పోరాట ఫలితం ఎలాగుంటుందో చూడాల్సిందే.




హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తప్పు చేసిన వారెవరూ తప్పించుకోలేరని.. ప్రతి ఒక్కరి నంబర్ వస్తుందన్నారు. లిక్కర్ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం సిసోడియానే విడిచిపెట్టలేదని.. కవితను ఎలా విడిచిపెడతామంటూ సంచలన కామెంట్స్ చేశారు. కవిత పేరు ఢిల్లీ లిక్కర్ కేసులో ఉందన్నారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ మంచి చేస్తారని అనుకుంటే ఆయన కూడా నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. 10 ఏళ్ల తర్వాత ఇప్పుడు పార్టీ పేరు మార్చి దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలని కేసీఆర్ భావిస్తున్నారన్నారు. జాతీయ రాజకీయాలు కేసీఆర్ చేద్దామనుకుంటే.. లిక్కర్ కేసులో కవిత జాతీయ స్థాయి వార్తల్లో నిలిచారంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఎంత తిన్నా సరిపోలేదని బిడ్డను ఢిల్లీకి పంపాడు కేసీఆర్ అంటూ కేంద్రమంత్రి వ్యాఖ్యలు చేశారు.

**కాళేశ్వరం బిగ్గెస్ట్ ఇంజినీరింగ్ బ్లండర్ ..** గొప్పలు చెప్పిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. కాళేశ్వరం బిగ్గెస్ట్ ఇంజినీరింగ్ బ్లండర్ అని అన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ కాదు.. పరివార్ సర్వీస్ కమిషన్ అని అన్నారు. కాళేశ్వరం ప్రాజక్ట్‌లో కరప్షన్ జరిగినట్లు కేటీఆర్ ఒప్పుకుంటున్నారని.. అవినీతి ఎంత జరిగిందో ఆయన తన తండ్రి కేసీఆర్‌ను అడిగి చెప్పాలని డిమాండ్ చేశారు.

“కేసీఆర్ నీకు దమ్ముంటే గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోపై చర్చకు సిద్ధమా. దళిత సీఎం, దళితులకు మూడెకరాలు, డబుల్ ఇండ్లు, ఇస్తామన్న ఉద్యోగాలు ఏమయ్యాయి” అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ గ్యారెంటీలు వర్కవుట్ అవ్వడం లేదని.. అబద్ధపు కాంగ్రెస్.. అబద్ధపు గ్యారెంటీలు అంటూ విమర్శించారు. తెలంగాణ ఏర్పాటులో కాంగ్రెస్ ఆలస్యం చేయడంతో ఎంతోమంది ప్రాణత్యాగం చేశారన్నారు. వరల్డ్ కప్‌లో ఇండియన్ టీం అద్భుతమైన ప్రదర్శన చేస్తోందని.. అలాగే తెలంగాణ ఎన్నికల సందర్భంగా బ్యాట్స్ మెన్‌గా తనను తెలంగాణకు పంపించారని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు.



## బుల్లెట్‌పై వచ్చి నామినేషన్ దాఖలు చేసిన రాజాసింగ్

హైదరాబాద్: గోషామహల్ నియోజకవర్గ భాజపా అభ్యర్థి రాజాసింగ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. తన అనుచరులతో కలిసి ఎలాంటి ఆర్భాటం లేకుండా.. బుల్లెట్‌పై వచ్చి అబిడ్స్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. రాజాసింగ్ వెంట పెద్ద ఎత్తున వచ్చిన భాజపా నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో.. నలుగురితో కలిసి అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలోకి వెళ్లారు. అంతకు ముందు దూల్‌పేట్‌లోని ఆకాశపురి దేవాలయంలో రాజాసింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## బీజేపీలో దూకుడు పెంచిన బండి సంజయ్

కరీంనగర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ దూకుడుతో దూసుకెళ్తుంది. ఇప్పటికే పలువురు జాతీయ అగ్ర నేతలతో జోరుగా ప్రచారం చేయిస్తోంది. బీజేపీ అధిష్ఠానం ఎన్నికల ప్రణాళికలో భాగంగా బండి సంజయ్‌తో పాదయాత్ర చేయించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మరోసారి పాదయాత్ర చేసేందుకు సిద్ధమయ్యారు. కరీంనగర్‌లో పాదయాత్రకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈనెల 7వ తేదీన కరీంనగర్ టౌన్ నుంచి పాదయాత్ర ప్రారంభం కానుంది. ఒకవైపు కరీంనగర్‌లో పాదయాత్ర.. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి బండి సంజయ్ సిద్ధమయ్యారు. 8వ తేదీన సిరిసిల్ల, నారాయణపేట నియోజకవర్గాలల్లో పర్యటనలు ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. బుల్లెట్ ప్రూఫ్ కారు భద్రత నడుమ బండి సంజయ్ ప్రచారం చేయనున్నారు. ఈనెల 6వ తేదీన సంజయ్ నామినేషన్ వేయనున్నారు.

# తెలంగాణ సాధించిన బిడ్డలుగా రోషం, పౌరుషం గలోళ్ళం

# ఢిల్లీ దొరలకు తలవంచే ప్రసక్తే లేదు

## కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : దొరల తెంగాణ కావాల్నా.. ప్రజల తెలంగాణ కావాల్నా.. అని మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. నిజంగా ఈ రోజు జరుగుతున్న పోరాటం.. నవంబర్ 30న ఢిల్లీ దొరలకు, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు మధ్య జరుగుతున్న పంచాయితీ ఇది అని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్ జలవిహార్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ న్యాయవాదుల సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. 1952లో ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే ఈ ఢిల్లీ దొర రాహుల్ గాంధీ ముత్తాత జవహర్ లాల్ నెహ్రూ. 1952లో సిటీ కాలేజీ వేదికగా ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అని నినదించిన ఐదు మంది పిల్లలను కాల్చి చంపింది ఈ ఢిల్లీ దొర రాహుల్ ముత్తాత. 1956లో ఇష్టం లేని పెళ్లి చేసింది కూడా ఢిల్లీ దొర నెహ్రూనే. 1968లో విద్యార్థులు, విద్యావంతులు, న్యాయవాదులు, మేధావులు కలిసి ఖమ్మం జిల్లాలో ఉద్యమం ప్రారంభిస్తే ఆ సందర్భంగా 370 మంది పిల్లలను పిట్టల్లా కాల్చి చంపించింది ఇదే ఢిల్లీ దొర రాహుల్ గాంధీ నాయినమ్మ ఇందిరమ్మ. 1971లో తెలంగాణ ప్రజలు తమ గుండెను చీల్చి, ఆత్మను ఆవిష్కరించి.. 11 ఎంపీలు సీట్లు మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజా సమితికి అప్పగిస్తే.. వాళ్లందరిని గొర్రెల మాదిరిగా గుంజుకుపోయి కాంగ్రెస్‌లో కలుపుకొని, ప్రజల తీర్పును అపహాస్యం చేసింది ఇదే ఢిల్లీ దొర రాహుల్ నాయినమ్మ ఇందిర. 2004 ఎన్నికల సందర్భంలో తియ్యటి మాటలు చెప్పి, తెలంగాణ ఇస్తామని నమ్మబలికి, పదేండ్లు చావగొట్టి, వందల మంది ప్రాణాలు తీసింది ఇదే ఢిల్లీ దొర రాహుల్ తల్లి సోనియా గాంధీ. ఇవన్నీ వాస్తవాలు.. నేను చెప్పట్లేదు అని కేటీఆర్ తెలిపారు.

**చావనైనా చస్తాం కానీ.. ఢిల్లీ దొరల ముందు తల దించం..** 2014 దాకా ఢిల్లీ దొరలతో కొట్లాడినం తెలంగాణ కోసం. 2014 తర్వాత మరొక దొర.. నరేంద్ర మోదీతో కొట్లాడుతున్నాం. తెలంగాణను అవమానించేలా మాట్లాడుతున్నారు. హైకోర్టు విభజనకు ఐదేండ్ల సమయం తీసుకున్నారు. అది మాత్రమే కాదు.. తెలంగాణ మెడ మీద కత్తి పెట్టి లొంగదీసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నా.. ఈ దొరతోని కూడా కొట్లాడుతున్నాం. చావనైనా చస్తాం కానీ.. ఈ ఢిల్లీ దొరల ముందు ఎట్టి పరిస్థితుల్లో కేసీఆర్ గానీ, బీఆర్ఎస్ పార్టీ గానీ తల దించదు. ఎందుకంటే మాకు ఆ చిత్తశుద్ధి ఉంది. తెలంగాణ సాధించిన బిడ్డలుగా రోషం, పౌరుషం ఉంది. ఈ సన్నాసుల ముందు ఎన్నటికీ తల దించం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ఫాక్స్‌కాన్‌ను బెంగళూరుకు తరలించేందుకు కాంగ్రెస్ కుట్ర.. డీకే శివకుమార్‌పై కేటీఆర్ ఫైర్ –** హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఫాక్స్‌కాన్ కంపెనీని బెంగళూరుకు తరలించేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నిప్పులు చెరిగారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఫాక్స్‌కాన్ కంపెనీకి లేఖ రాయడంపై కేటీఆర్ ధ్వజమెత్తారు. ఫాక్స్‌కాన్ కంపెనీ ఆపిల్ ఫోన్లకు సంబంధించిన అనేక పరికరాలు తయారు చేస్తోంది. చైనాలో 15 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించింది. మనం కష్టపడి నాలుగేండ్లు వెంబడి పడి తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఒప్పించుకున్నాం. వివిధ వేదికల్లో అమెరికా, చైనా తైవాన్‌లో కలిసిన తర్వాత 2022లో ఫాక్స్‌కాన్ చైర్మన్ హైదరాబాద్‌కు వచ్చి సీఎం కేసీఆర్‌ను కలిసి ఫ్యాక్టరీ పెడుతాం అని ప్రకటించారు. ఒక లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదురుగా కొంగరకొలాన్‌లో 200 ఎకరాల స్థలంలో నిర్మాణం ప్రారంభించారు. రెండు అంతస్తులు పూర్తయ్యాయి. వచ్చే ఏప్రిల్, మే నెలలో ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రారంభం కానుంది అని కేటీఆర్ తెలిపారు.

అయితే కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఫాక్స్‌కాన్ కంపెనీకి అక్టోబర్ 25న లేఖ రాశారు. ఆపిల్ ఎయిర్ పాడ్స్ ఇండస్ట్రీని హైదరాబాద్ నుంచి బెంగళూరుకు మార్చండి. తొందరల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతోంది. హైదరాబాద్ నుంచి పరిశ్రమలను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి బెంగళూరుకు తరలిస్తాం. ఇందుకు తెలంగాణలో ఉండే కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తుంది అని డీకే శివకుమార్ తన లేఖలో పేర్కొన్నట్లు కేటీఆర్ గుర్తు చేశారు.

గరుడ వార్త



# సంపాదకీయం

## పెరిగిపోతున్న 'అయోధ్య' రగడ

తొందరలో జరగబోతున్న మధ్యప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ సెంటిమెంటునే నమ్ముకున్నట్లుంది. సెంటిమెంటు ఎక్కడెక్కడ వర్కవుటవుతుందో అక్కడల్లా ప్రయోగించాలని డిసైడ్ అయినట్లుంది. అందుకనే మధ్యప్రదేశ్ లో ఎక్కువగా సెంటిమెంటును ఉపయోగిస్తోంది. ఇక్కడి ఎన్నికల్లో రామ మందిరం ఇష్యూని బాగా ప్రయోగిస్తోంది. కమలనాదులు చేస్తున్న ప్రచారంలో ఎక్కువగా అయోధ్యలోని రామమందిరం నిర్మాణాన్ని ఉపయోగిస్తున్నారు. రామమందిరం నిర్మాణం జరుగుతున్న ఫొటోలను, బ్యానర్లను విచ్చలవిడిగా ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో మతపరమైన అంశాలను, సెంటిమెంటును ఉపయోగించకూడదని ఎన్నికలకమీషన్ స్పష్టంగా చెబుతోంది. కమీషన్ నిబంధనలు ఎంత స్పష్టంగా ఉన్నా బీజేపీ దేన్నీ పట్టించుకోవటంలేదు. బీజేపీ ప్రచార విధానాన్ని కాంగ్రెస్ అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ తీరుపై కేంద్ర ఎన్నికల కమీషన్ కు ఫిర్యాదులు కూడా చేసింది. అయితే తన ప్రచారాన్ని బీజేపీ సమర్ధించుకుంటోంది. హిందువులంటే కాంగ్రెస్ కు గిట్టదనే విచిత్రమైన వాదనతో కాంగ్రెస్ పై ఎదురుదాడి మొదలుపెట్టింది. అయోధ్య రామమందిరం, ఉజ్జయిని మహాకాల్ ఫొటోలతో రాష్ట్రంలేని చాలా నియోజకవర్గాల్లో బీజేపీ కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు ఏర్పాటుచేసింది. బీజేపీ ప్రచారం తీరుపై కాంగ్రెస్ తోపాటు ఇతర పార్టీలు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నా పట్టించుకోవటం లేదు. బీజేపీ తరపున జరుగుతున్న సోషల్ మీడియా ప్రచారంలో కూడా ఇదే విధమైన పద్దతిలో ప్రచారం జరిగిపోతోంది. తాను నిబంధనలకు వ్యతిరేకంగా సెంటిమెంటును ప్రయోగిస్తు కాంగ్రెస్ హిందువులకు వ్యతిరేకమని ఎదురుదాడులు చేయటం బీజేపీకే చెల్లింది. మొత్తానికి ఎన్నికల ప్రచారంలో ఏవైతే నిషిద్ధాలో వాటన్నింటినీ బీజేపీ యధేచ్చగా ఫాలో అయిపోతోంది. కారణం ఏమిటంటే కేంద్రలో అధికారంలో ఉండటమే. కేంద్రంలో అధికారంలో ఉన్నకారణంగా ఎన్ని పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా ఎన్నికల కమీషన్ కు ఫిర్యాదుచేసినా ఎలాంటి ఉపయోగం కనబడటంలేదు. దీన్ని అడ్డుపెట్టుకుని ఆకాశమే హద్దుగా రెచ్చిపోతోంది. ఈ ధోరణి మధ్యప్రదేశ్ లో మాత్రమే ఎక్కువగా కనబడుతోంది. రాజస్ధాన్, చత్తీస్ ఘడ్, తెలంగాణాలో మతపరమైన ప్రచారం జోలికి బీజేపీ వెళ్ళటంలేదు. ఎందుకంటే అధికారంలో ఇక్కడున్నవి బీజేపీయేతర పార్టీలు కాబట్టే. ఏమైనా తేడా వస్తే వెంటనే యాక్షన్ తీసుకునే పేరుతో పోలీసులు రంగంలోకి దిగేస్తారు. అందుకనే ఆ భయం వల్లే పైరాష్ట్రాల్లో జాగ్రత్తగా ప్రచారం చేసుకుంటోంది.

# బిఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి

### బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి...

### గ్రామ అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరు బిఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టాలి...

### గ్రామ సర్పంచ్ గురుక కుమార్ యాదవ్




గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: పసిడి పండించే రైతు మొదలు పసిపాప వరకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన బిఆర్ఎస్ పార్టీపై నే ప్రజలకు ఎనలేని నమ్మకం ఉందని మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం శామీర పేట మండలంలోని అలియాబాద్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ చామకూర మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రచారం చేశారు బిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టి, విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామంలోని గడపగడపకు చేర్చాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త పైన ఉందన్న విషయం విస్మరించొద్దని ఆయన కోరారు. ప్రారంభోత్సవ అనంతరం గ్రామంలో పార్టీ కార్యకర్తలతో కలిసి పర్యటిస్తూ ప్రజల అమూల్యమైన ఓటు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మల్లారెడ్డికె వేసి గెలిపించాలని అయినా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గురక కుమార్ యాదవ్, ఎంపిటిసిలు కోడూరు అశోక్, సగ్గ శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, లింగం, జగదీష్ గౌడ్, శ్రీకాంత్, స్వామి తో పాటుగా నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల శిక్షణ తరగతులకు అధికారుల హాజరు తప్పనిసరి...

### గైర్హాజర్ సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవు...

### ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలి...

### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్





గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి శిక్షణ తరగతులకు హాజరు కాని అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం ఆయన రామంతాపూర్లోని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులు, బాధ్యతలు పట్ల అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, ఎన్నికల శిక్షణ శిబిరాన్ని పరిశీలించి శిక్షణ తరగతుల గురించి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించి చేపట్టాల్సిన విధులు తదితర అంశాలపై శిక్షణనివ్వడం జరుగుతుం దన్నారు. ఈ శిక్షణకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల శిక్షణ తరగతులకు అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని... లేనియెడల ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. ఈ విషయంలో ముందు ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం తప్పకుండా ఎన్నికల శిక్షణ తరగతులకు హాజరు కావాల్సిందిగా సూచించారు.

# శాసనసభ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి...

### జిల్లా వ్యయపరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్మీనా, బాలా సాహెబ్ బాపూరావు.




గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : తెలంగాణ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఈ విషయంలో అధికారుల పాత్ర ఎంతో కీలకమని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్ వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్ మీనా, కుత్బుల్లాపూర్, కూకట్పల్లి వ్యయ పరిశీలకులు బాలా సాహెబ్ బాపూరావు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులు సంబంధిత బృందాలు, ఎన్నికల విభాగం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన ఆయా అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులు నిఘా బృందాలు, అకౌంటింగ్ బృందాలతో సమావేశం నిర్వహించి, ఎన్నికల వ్యయ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల ఖర్చుల నమోదు కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు , స్టాటిక్ సర్వేలెన్సు బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు, షాడో టీమ్, వాహనాల తనిఖీల తదితర వివరాలను క్షుణ్ణంగా ఒక్కో నియోజకవర్గంకు సంబంధించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. చట్టంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికి రూ. 40 లక్షల వ్యయ పరిమితి ఉందన్నారు. అభ్యర్థులు ఖర్చు విషయమై రిజిస్ట్రర్లు నిర్వహించాలని, వ్యయ పరిశీలన బృందం అభ్యర్థుల వ్యయంపై షాడో రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు.

అలాగే ప్రతిరోజూ రోజువారి నిర్వహణపై రిజిస్టర్లు చేపట్టాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ప్రతిరోజూ సమర్పించే నివేదికల కాపీ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల వ్యయ పరిశీలకులకు సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమ ంలో అధికారులు డీసీవో శ్రీనివాస మూర్తి, డీటీవో నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు...

శామీర్ పేట (గరుడ వార్త): ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం రోజురోజుకు పెరుగుతోందని మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలో శనివారం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదిర్ రెడ్డి, ఏ బ్లాక్ జిడిపల్లి వెణుగోపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టి అద్యక్షుడు బోమ్మలపల్లి నర్సింహులు యాదవ్, ఎంపిటిసి అఖిలెష్ రెడ్డి అద్వర్యంలో కేశవరం గ్రామ బిఆర్ ఎస్ వార్డు సబ్యులు కొంపల్లి వినోద్ కూమార్, బంకుల బాస్కర్ బిజెపి నాయకులు తప్పెట్ల వెంకటెష్ తోపాటుగా లింగాపూర్ తదితర గ్రామాల నుండి సుమారు



100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ రామిడి శాశిందర్ రెడ్డి, మండల ప్రదాన కార్యదర్శి కిసరి నర్సింహులు, గుర్రం బస్వరెడ్డి, ,వెణుగోపాల్ రావు,బోమ్మలపల్లి శెకర్ యాదవ్ ,బోమ్మలపల్లి మల్లెష్ యాదవ్ ,ప్రభాకర్ రెడ్డి ,పురెల్లి శెకర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టి నాయకులు కిసరి బాను చందర్ తో పాటుగా ఇతర నాయకులు పాల్గోనారు.

# రెండో రోజు వరకు పన్నెండు నామినేషన్లు దాఖలు

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా

### ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లావ్యాప్తంగా శనివారం వరకు మొత్తం 12 నామినేషన్లు దాఖలయ్యాయని మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు నామినేషన్లు, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడు, కూకట్పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదు నామినేషన్లు సంబంధిత ఆర్వోలు స్వీకరించారని మొత్తం జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శ్రీధర్రెడ్డి జిన్న, ప్రవీణ్ కుమార్ రెడ్డి గౌనిలు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారన్నారు. అలాగే మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జాజుల భాస్కర్ శ్రమజీవి పార్టీ తరపున, చుండి శోభన్బాబు తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ తరపున, భారతీయ జనతా పార్టీ తరపున వి.ప్రసన్న నాయుడు నామినేషన్ దాఖలు చేయగా (లోటస్) గుర్తు కేటాయించినట్లు తెలిపారు. కూకట్పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చంద్రశేఖర్ చలిక స్వతంత్ర అభ్యర్థిగా, మామిళ్ళ ఆనంద్ ఇండియా ప్రజాబంధు పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అలాగే ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వేరు చిన్న ధనరాజ్ స్వతంత్ర అభ్యర్థిగా..., ఎం.మల్లేశం తెలంగాణ

ప్రజా జీవన రైతు పార్టీ తరపున..., కర్రి వెంకోజీ రావు స్వతంత్ర అభ్యర్థిగా, మంజుల ఉప్పల స్వతంత్ర అభ్యర్థినిగా, అలమూరి తిమ్మయ్యచారి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున తమ నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వివరించారు. రెండో రోజు నామినేషన్ల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్ కూడా రాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు రెండో రోజు సైతం నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.

# అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో ఉన్న విద్యుత్తు, రిజిస్ట్రార్, ఎక్సైజ్, ట్రెజరీ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఈ కార్యాల యాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తు న్నారు. అరకొర వసతులతో సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భవనం లేక పోవడంతో వర్ధన్నపేట బస్టాండ్ పక్కనున్న ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. ట్రెజరీ కార్యాలయం.. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని పాత ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగుతోంది. ఈ భవనంలో రెండుగదులు ఉండగా మరుగుదొడ్లు లేవు. వర్షం వచ్చినప్పుడు భవనం కురుస్తుంది. వర్ధన్నపేట, ఖిలావరంగల్, పరకాల, నర్సంపేట ఎక్సైజ్ కార్యాలయాలకు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా.. పనులు ప్రారంభించారు. నిధులు వెనక్కివెళ్లడంతో గుత్తేదారులు పనులను మధ్యలోనే నిలిపివేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు రాలేదు: తహసీల్దార్ నాగరాజు, వర్ధన్నపేట

వర్ధన్నపేట పరిధిలో కొన్ని కార్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తు న్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ప్రతిపాదనలు అందలేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి సంబంధించిన ప్రతిపాదనలు రాగా.. స్థల పరిశీలన చేస్తున్నాం. ఆయా శాఖలు స్థలాలు కావాలని కోరితే అందుబాటులో ఉన్న స్థలాలను పరిశీలించి కేటాయిస్తాం.

నిధులు వెనక్కిపోయాయి: అరుణ, సబ్ రిజిస్ట్రార్, వర్ధన్నపేట

వర్ధన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు కోరడంతో పంపించాం. ఉన్నతాధికారులు మళ్లీ ప్రతిపాదనలు అడిగితే పంపిస్తాం. గతంలో మంజూరైన నిధులు కొన్ని కారణాలతో వెనక్కిపోయినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం: పవన్‌కుమార్, ఎక్సైజ్ సీఐ, వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయ సమీపంలో రెండేళ్ల క్రితం వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. గుత్తేదారుకు డబ్బుల చెల్లింపులు నిలిచిపోవడంతో పనులు జరగడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.


# ఎన్నికలకు సాంకేతిక దన్ను

ఆదిలాబాద్ : రాబోయే శాసన సభ ఎన్నికలకు సాంకేతిక పరంగా అన్ని సమకూర్చేందుకు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) సర్వం సిద్ధం చేసింది. ఎన్నికలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ పటిష్ఠంగా, పారదర్శకంగా ఉండేందుకు ప్రైవేటు సహకారంతో లీజ్ లైన్లు(డేటా సర్క్యూట్), పోలింగ్ కేంద్రాలకు వెబ్‌కాస్టింగ్ అమర్చనుంది. మరింత మెరుగైన, వేగవంతంగా అంతర్జాల సేవలు అందుబాటులో రానుండటంతో కంట్రోల్ రూం నుంచే మొత్తం ఎన్నికల సరళి, సమస్యలున్న చోట సాంకేతిక నిపుణులు దగ్గరుండి పరిష్కరించేందుకు వీలు కల్పిస్తున్నారు.

లీజ్ లైన్లు ఇలా..

ఉమ్మడి జిల్లాలో 4 (ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం, మంచిర్యాల), పది నియోజకవర్గ పరిధిలో లీజ్ లైన్లు(100 ఎంబీపీఎస్ వేగం) పెట్టనున్నారు. మొత్తం 14 లీజ్‌లైన్‌లు అందుబాటులోకి రానున్నాయి. అవసరం ఉన్న వారికి ఫైబర్ టు ద హోం(ఎఫ్‌టీటీహెచ్) పద్ధతిలో ల్యాండ్‌లైన్ కనెక్షన్లు ఇవ్వనున్నారు.

అవసరమున్న చోట వెబ్‌కాస్టింగ్



ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ఎప్పటి మాదిరిగానే ఈసారి వెబ్‌కాస్టింగ్‌ను ఉపయోగించనున్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ బీఎస్ఎన్ఎల్ ప్రైవేటు సహకారంతో పోలింగ్ కేంద్రాలకు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, చెక్ పోస్టులు, ఈవీఎం తరలించే వాహనాల వద్ద జీపీఎస్ కెమెరాలు అమర్చనున్నారు.ప్రత్యక్ష ప్రసారం, నిక్షిప్తం..ఉమ్మడి జిల్లాలో పోలింగ్, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం, వాటి నిక్షిప్తం కోసం ప్రత్యేకంగా సీసీటీవీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని కంట్రోల్ రూంకు అనుసంధానం చేయనున్నారు.

సిద్ధంగా ఉన్నాం

కె.దేవిదాస్, ఉమ్మడి జిల్లా సహాయ జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సాంకేతిక సహకారం అందించేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఈసారి అత్యంత వేగంగా పని చేసే 14 డేటా సర్క్యూట్‌లను(100 ఎంబీపీఎస్) పెడుతున్నాం. అలాగే పోలింగ్, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అమర్చే వెబ్‌కాస్టింగ్‌లో ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా మా సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

# తేమ ఉంటేనే.. మద్దతు ధర

అడవిదేవులపల్లి : ఉమ్మడి నల్గొండ జిల్లాలో వానాకాలం సీజన్‌లో పండిన పత్తి, వరి పంటలు ఇప్పుడిప్పుడే చేతికి వస్తున్నాయి. దిగుబడులకు గిట్టుబాటు ధర రావాలంటే పంట నాణ్యతగా ఉండాలి. ఉమ్మడి జిల్లా పరిధిలో పత్తి, వరి కోత దశలో ఉండటంతో ప్రభుత్వ కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పత్తి పంటను సీసీఐ కొనుగోలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. తేమ శాతాన్ని బట్టి ధరను నిర్ణయిస్తుండటంతో ఒకటి రెండు రోజులు ఆరబెట్టి తీసుకెళ్తే మేలు. నాణ్యత నిర్ధారణ.. పత్తిలో 8 శాతం తేమ ఉన్న పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020. తేమ శాతం ఎక్కువగా ఉంటే ప్రతి ఒక శాతానికి రూ.70 చొప్పున ధర తగ్గించి ఇస్తారు. అది కూడా 12



శాతం తేమ వరకే కొనుగోలు చేస్తారు. అంతకు మించి ఉంటే పత్తిని సీసీఐ కొనుగోలు చేయదు.కంది తేమశాతం 10-14 శాతం లోపు ఉండాలి. దెబ్బతిన్న గింజలు మూడు, నాలుగు శాతం వరకు ఉంటే పర్వాలేదు. ఎక్కువగా ఉంటే ధర తగ్గిస్తారు.

వేరుసెనగలో తేమ శాతం 8 లోపు ఉండాలి. కాయలు మంచిగా ఉండాలి. వీటిలో 5 శాతం లోపు దెబ్బతిన్న గింజలు మాత్రమే తీసుకుంటారు.మొక్కజొన్నలో తేమ 12 శాతం లోపు ఉండాలి. వేరే పంటకు పదార్థాలు 0.25-0.75 శాతం వరకు ఉండొచ్చు. దెబ్బతిన్న గింజలు ఒక శాతం లోపు మాత్రమే ఉండాలి.పప్పుదినుసుల్లో 12 శాతం, ధాన్యంలో 14 శాతంలోపు తేమ ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉంటే ధరలో కోత విధిస్తారు.

# ఆస్తుల లెక్క... తప్పితే కేసులు పక్కా

నాంపల్లి : ఒక్క పొరపాటు రాజకీయ జీవితాన్నే తలకిందులు చేస్తుంది. తప్పు దొర్లితే పదవి మధ్యలోనే ఊడిపోతుంది. ఎన్నికల ప్రకటన వెలువడ్డాక అన్ని పార్టీల అభ్యర్థుల్లో ఇదే హైరానా కనిపిస్తోంది. ఎన్నికల్లో గెలవడమే కాదు సరైన వివరాలతో ఏ మాత్రం తప్పిదాలకు అవకాశం లేకుండా నామినేషన్ దాఖలు చేయడం విజయం లాంటిదేనని అనుభవజ్ఞులైన నేతలు చెబుతున్నారు. ఏమాత్రం తప్పు దొర్లినా నామినేషన్ తిరస్కరణకు గురవుతుందన్న ఆందోళన అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది.ఎక్కువగా ఇవే తప్పులు...నామినేషన్లలో ఎక్కువగా పేర్లు, వయసు, కులం, ఆస్తులు నేర చరిత్రకు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తమవుతుంటాయి. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లు ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటాయి. వీటిని నిశితంగా పరిశీలించేవారు లోపాల్ని ఎత్తి చూపుతుంటారు. ప్రత్యర్థులూ వీటిని ఆయుధంగా వాడుకుంటారు.

ప్రచార ఖర్చు సవాలే..అఫిడవిట్లతో పాటు ఎన్నికల వ్యయాన్ని చూపించడమూ పెద్ద సవాలే. గతంలో అధిక వ్యయం చేశారంటూ కొందరిపై కేసులు నమోదయ్యాయి. అఫిడవిట్ దాఖలు సందర్భంగా రిటర్నింగ్ అధికారి పూర్తిగా పరిశీలించాల్సి ఉంటుంది. ఈ కారణంగా ఇటీవల రాష్ట్రంలో ఓ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కోర్టు నుంచి అనర్హత వేటుకు గురైన విషయం తెలిసిందే.

ఇవి పాటించాల్సిందే..ఓటరు జాబితాలో అభ్యర్థి పేర్లలోని అక్షరాలు, వయసు, లింగం ఒకలా.. నామినేషన్ పత్రాల్లో మరోలా ఉంటే నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులకు నేర చరిత్ర ఉంటే కచ్చితంగా తెలియజేయాల్సి ఉంటుంది.

# హాజరులో మరింత పారదర్శకత



నిజామాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి పీరియడ్‌లో వినిపించే ప్రజెంట్ సార్, ఎస్ సార్ మాటలకు బదులు.. 'క్లిక్' చప్పుళు వినిపించనున్నాయి. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య తెలుసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజనం తదితర విషయాల్లో విద్యార్థుల వివరాలు తెలుసుకునేందుకు ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నైజేషన్) విధానం అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనిపై శిక్షణ పొందిన జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. రాష్ట్రస్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు అన్ని బడుల్లో విద్యార్థుల హాజరును ఎప్పటికప్పుడు పరిశీలించే అవకాశం లభించింది.

గతంలో ఇలా..గతంలో ప్రతి తరగతిలో విద్యార్థుల హాజరు పట్టిక ఉండేది. నిత్యం మొదటి పీరియడ్‌లో విద్యార్థుల క్రమ సంఖ్య ఆధారంగా హాజరును నమోదు చేసేవారు. ప్రధానోపాధ్యాయులు ప్రతినెల చివరి తేదీన తరగతుల వారీగా విద్యార్థుల హాజరు వివరాలను ఉన్నతాధికారులకు పంపించేవారు. కొన్ని పాఠశాలల్లో హాజరైన విద్యార్థుల వాస్తవ సంఖ్య, మధ్యాహ్న భోజనం చేసేవారి సంఖ్య, ఉచిత దుస్తులు, పుస్తకాలు పొందే సంఖ్యలో తేడాలు ఉండేవి. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం హాజరు నమోదులో కొత్త విధానం అమల్లోకి తెచ్చింది.

ఇక నుంచి ఇలా చేస్తారు

కొత్తగా 'డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్' యాప్ రూపొందించారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీనిని తమ చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్‌లో పాఠశాల యూడైస్ ప్లస్ కోడ్ నంబరు నమోదు చేయగానే తరగతుల వారీగా విద్యార్థుల పేర్లు, వారి ప్రవేశ సంఖ్య తదిరత వివరాలు కనిపిస్తాయి. ప్రతి విద్యార్థి ఫొటో ఇదివరకే రిజిస్టర్ చేశారు. ఒక్కసారి నమోదు చేసిన వివరాలు విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు నిక్షిప్తమయ్యేలా రూపొందించారు. నిత్యం ప్రార్థన ముగిసిన తర్వాత విద్యార్థులను విడిగా లేదా బెంచీల వారీగా, తరగతుల వారీగా కూర్చోబెట్టి ఒకేసారి ఫొటో తీస్తే సరిపోతుంది. ముఖ గుర్తింపు ఆధారంగా వారి హాజరు నమోదవుతుంది.పక్కాగా అమలు చేయాలి- దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్ఇదివరకు ఉపాధ్యాయుల హాజరు జియో అంటెండెన్సులో నమోదు చేశారు. అందులో పలురకాల సమస్యలు తలెత్తాయి. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల హాజరులో పారదర్శకత కోసం ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు అందుబాటులోకి తెచ్చింది. ఉపాధ్యాయులు ఫొటో ఆధారిత హాజరును పక్కాగా అమలు చేయాలి.

# ఈసీ ఆదేశాలు.. బాధితుల్లో ఆశలు



నిర్మల్ : ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. దీంతో పలు నిబంధనలు, నియమావళి అమల్లోకి వచ్చాయి. రూ. 50 వేలకు మించి నగదు తరలించడం, కల్గిఉండటం చేయొద్దని అధికారులు విస్తృతంగా ప్రచారం చేపడ్తున్నారు. అయినప్పటికీ జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇప్పటికే నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారులకు వాటిని అప్పగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు, రాజకీయ పార్టీలకు ఏమాత్రం సంబంధం లేని నగదు ఉంటే సంబంధిత యజమానులకు వెంటనే తిరిగివ్వాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో బాధిత వ్యక్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నిబంధనల పేరిట..ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీలు చేపడ్తున్నారు. అవాంఛనీయ ఘటనలు ఎదురవకుండా, నిబంధనలకు విరుద్ధంగా మద్యం- నగదు తరలిపోకుండా ప్రత్యేకంగా తనిఖీ కేంద్రాలు ఏర్పాటుచేశారు. పగలు, రాత్రి తేడాలేకుండా నిరంతర తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రూ. 50 వేలకు మించి నగదును తీసుకెళ్తూ పట్టుబడిన వారిని విచారించి, సరైన పత్రాల్లేకపోతే దాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఇలా ఇప్పటికే పదుల సంఖ్యలో ఘటనలు నమోదవడం గమనార్హం.

సామాన్యులే..అయితే.. ఇలా పట్టుబడ్డవారిలో చాలావరకు సామాన్య ప్రజలు, వ్యాపారులే ఉండటంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టుబడ్డ నగదుకు సంబంధించిన పత్రాలు అందజేసేందుకు నానాతంటాలు పడాల్సి వస్తోంది. ప్రధానంగా దసరా నవరాత్రులు కావడంతో కొంతమంది బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారు. వ్యాపారులు వివిధ అవసరాల నిమిత్తం నగదును వెంట తీసుకెళ్లారు. రైతులు పంట అవసరాల నిమిత్తం, రుణాలు చెల్లించేందుకు వచ్చినవారు, స్థానికంగా చిట్టీలు నిర్వహిస్తున్నవారు, వాటిని ఎత్తుకున్నవారు, బ్యాంకుల్లో నగదు డిపాజిట్ చేసేందుకు వెళ్తున్నవారు.. ఇలా వివిధ సందర్భాల్లో పోలీసులకు పట్టుబడ్డారు. ఆ సమయంలో తమ వద్ద ఉన్న డబ్బు సొంతం, వ్యక్తిగతమే అయినా అది నిరూపించేందుకు అవసరమైన పత్రాలను సమర్పించే అవకాశం లేకుండా పోయింది. దీంతో వారంతా సందిగ్ధంలో పడిపోయారు. అధికారులను అభ్యర్థించినా నిబంధనల పేరిట వారు కూడా మేమేం చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. ఇదంతా స్థానికులను భయాందోళనకు గురిచేయడంతో పాటు అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలకు తావిచ్చింది.సారంగాపూర్ మండలంలోని ఓ పెట్రోలు బంకులో వచ్చిన కలెక్షన్ డబ్బులను బ్యాంకులో వేసేందుకు వెళ్తున్న వ్యక్తిని పోలీసులు తనిఖీల్లో భాగంగా ఆపి సోదా చేశారు. నగదుకు సంబంధించి సరైన పత్రాల్లేవని రూ.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సదరు వ్యక్తి డబ్బుకు సంబంధించిన వివరాలను, ఆధారాలను అధికారులు అందించడంతో విచారణ అనంతరం డబ్బు తిరిగిచ్చారు. నిర్మల్ పట్టణంలోని ఓ బ్యాంకు నుంచి రూ.1.06 లక్షలను డ్రా చేసుకున్న రైతు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. పోలీసుల తనిఖీల్లో ఆపి సోదాచేయడంతో నగదు లభించింది. వివరాలు లేక వాటిని జప్తు చేసుకున్నారు. ఆతర్వాత సదరు రైతు తన సాగు అవసరాల నిమిత్తం బ్యాంకు నుంచి డబ్బులు తీసుకొస్తున్నట్లు పేర్కొంటూ, సంబంధిత పత్రాలను అధికారులకు అందించారు. విచారణ జరిపి డబ్బులు అప్పగించారు.

మొదలవని రాజకీయ ప్రమేయం?

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ ఇంకా నామినేషన్ల దాఖలు మొదలుకాలేదు. ఈ కారణంగానే ఇంకా నగదు తరలింపు, ఇతరత్రా సందర్భాల్లో రాజకీయ ప్రమేయం ఇంకా ఊపందుకోలేదని తెలుస్తోంది. నామినేషన్లు సమర్పించడం, విత్‌డ్రా, పరిశీలన, చివరగా బరిలో నిలిచినవారు.. ఇలా ప్రధాన ప్రక్రియంతా పూర్తయ్యేందుకు మరో పక్షం రోజులు సమయం ఉంది. ఈలోపు రాజకీయ పార్టీలు, ఎన్నికలకు సంబంధించి నగదు తరలింపు జరిగేందుకు పెద్దగా ఆస్కారం ఉండకపోవచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. అధికారుల తనిఖీల్లో పట్టుబడినవారిలో మెజార్టీ భాగం సామాన్యులు, వ్యాపారులే ఉండటం దీనికి నిదర్శనమని పేర్కొంటున్నారు. రాజకీయంగా ఎలాంటి సంబంధం లేకుండా, కేవలం తమ సొంత అవసరాల నిమిత్తం నగదును తీసుకెళ్లాల్సిన సందర్భంలో తనిఖీ అధికారులు నిజానిజాలను రూఢీ చేసుకోవాలని, సామాన్యులకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని కోరుతున్నారు.

# ఆశపడ్డారు.. ఆపై బోల్తాపడ్డారు

జన్నారం : భూముల మీద పెట్టుబడి పెట్టగా ఎక్కువ సొమ్ము చెల్లిస్తామని ఆశ చూపడంతో రూ.5 కోట్ల వరకు బాధితులు నష్టపోయిన ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు సమాచారం. బాధితుల కథనం ప్రకారం.. జనగామ, ఆలేరుతోపాటు ఆ ప్రాంతంలోని మరికొన్ని గ్రామాల్లో భూముల మీద రూ.15 లక్షలు పెట్టుబడి పెడితే ఒక ప్లాట్‌ను నెల రోజుల తర్వాత పెట్టుబడి పెట్టిన వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని నమ్మించారు. దీంతోపాటు పెట్టుబడి నుంచి ప్రతి నెల 8 శాతం సొమ్ము(రూ.1,20,000) పన్ను కింద రూ.12,000 పోనూ రూ.1,08,000 తిరిగి ఓ యాప్‌లోని వ్యాలెట్‌లో జమ చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇలా 20 నెలల్లో రూ.21,60,000లతోపాటు ఒక సభ్యుడిని ఇందులో చేర్పిస్తే రూ.2,40,000 ఇస్తూనే, రూ.15 లక్షల ప్లాట్‌కు 20 నెలల తర్వాత రూ.13,50,000 ఇచ్చి తిరిగి కొనుగోలు చేస్తామని ఆశ చూపించారు. కొందరు వడ్డీకి తెచ్చి, మరికొందరు ఇద్దరు లేదా ముగ్గురు కలిసి రూ.15 లక్షలు చెల్లించారు. ఓ ప్రభుత్వ ఉద్యోగి రూ.10 లక్షలు బ్యాంక్ నుంచి, మరో రూ.5 లక్షలు బయట వ్యక్తుల వద్ద అప్పు తీసుకుని రూ.15 లక్షలు చెల్లించి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొంత కాలానికి రూ.5 లక్షలు ఆయన బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. దీంతో వచ్చిన రూ.5 లక్షలను తిరిగి భూముల మీదనే పెట్టుబడిగా పెట్టారు. తెలిసిన మిత్రులకు ఇదే విషయాన్ని చెప్పడంతో అందులోనూ కొందరు చెల్లించారు. ఒక్క



జన్నారం మండలానికి చెందిన 40 మంది వరకు బాధితులు రూ.5 కోట్ల వరకు పెట్టుబడి పెట్టారు. ఇందులో చాలా మందికి ప్లాట్ రిజిస్ట్రేషన్ కూడా కాలేదని సమాచారం.

జైలుకు వెళ్లడంతో...! ఈ తతంగాన్ని నడుపుతున్న వ్యక్తి ఓ కేసులో జైలుకు వెళ్లడంతో లావాదేవీలన్నీ నిలిపివేశారు. దీంతో ఒక్కసారిగా పెట్టుబడులు పెట్టిన వారు అవాక్కయ్యారు. ఏం చేయాలో తోచని స్థితిలో కొందరు వ్యక్తులు ఈ నెల 30న సదరు వ్యక్తి వద్దకు వెళ్లి అడగడంతో జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఎవరికి ఇవ్వాల్సిన సొమ్ము వాళ్లకు తిరిగి ఇస్తానని హామీ ఇచ్చినట్లు బాధితుల్లో ఒకరు తెలిపారు.

# కలిసొచ్చిన కాలం

మేళ్లచెరువు : జిల్లాలో వానాకాలం వరి పంట కోతలు సాగుతున్నాయి. దీంతో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధాన్యం రాక పెరుగుతోంది. జిల్లాలో 3,77,843 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ముందుగా సాగు చేసిన రైతుల పొలాలు కోసి నూర్పిడి పనులు చేపడుతున్నారు. మిగతా వారు ఇంకా 15 రోజల వరకు వేచి ఉండే అవకాశం ఉంది. సూర్యాపేట మార్కెట్ యార్డుకు కర్షకులు 17,770 బస్తాల(11,552 క్వింటాళ్ల) వడ్లు తీసుకొచ్చారు. రోజురోజుకూ ధాన్యం రాక మార్కెట్‌కు పెరుగుతోంది. జిల్లాలో ఆరు మార్కెట్ యార్డులు ఉన్నాయి. నిరంతరం సూర్యాపేట మార్కెట్ యార్డు కొనుగోళ్లు చేపడుతుండగా మిగతా మార్కెట్లలో పంట సీజన్‌గా కొంటున్నారు. పూర్తిస్థాయిలో కోతలు ప్రారంభమైతే సూర్యాపేట మార్కెట్ యార్డుకు ధాన్యం రాక ఇంకా పెరిగే అవకాశం ఉంది.

పాత రకాలకు పండగ... సూర్యాపేట మార్కెట్ యార్డులో కొత్త ధాన్యం కంటే పాత రకాలకు అధిక ధర పలుకుతోంది. కొత్త ధాన్యం పచ్చిగా



ఉండటంతోపాటు అన్నం ముద్దగా ఉంటుంది. ఎక్కువ తూకం రావడంతో ధర మాత్రం తక్కువగా ఉంటోంది. పాత రకం వడ్లకు డిమాండ్ ఎక్కువగా ఉండటం, పైగా సన్నాలు కావడంతో ధర పలుకుతోంది. వీటిని మార్కెట్‌లో ఖరీదుదారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. జిల్లా నుంచి సూర్యాపేట మార్కెట్ యార్డుకు పాతరకం ధాన్యం జైశ్రీరాం, బీపీటీ, హెచ్ఎంటీ రకాలు ఎక్కువగా వస్తున్నాయి. ఇవి సన్నాలు కావడంతో ఎక్కువ మంది తినడానికి ఆసక్తి చూపుతున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఖరీదుదారులతో పాటు మిల్లర్లుగా ధర అధికంగా వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో పాతరకం జైశ్రీరాం వడ్లు క్వింటాకు గరిష్ఠ ధర రూ.3019, బీపీటీ రూ.3329, హెచ్ఎంటీకి రూ.2819 పలికింది. జైశ్రీరాం 41బస్తాలు (27 క్వింటాళ్లు), బీపీటీ 71 బస్తాలు(46 క్వింటాళ్లు), హెచ్ఎంటీ 123 బస్తాలు(80 క్వింటాళ్లు) మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చారు.

డిమాండ్ ఉండటంతో ..- ఫసియొద్దీన్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేటపాత రకం ధాన్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. సన్నాలు కావడంతో ఎక్కువగా తినేందుకు వినియోగిస్తారు. మిల్లర్లు కూడా దుకాణాలకు ఎక్కువగా సరఫరా చేస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ధర పెరుగుతోంది.

# తపాలా ఓటుకు అవకాశం!

మేళ్లచెరువు : పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకు నేందుకు ఇప్పటి వరకు సర్వీసు, ప్రత్యేక తదితర అయిదు రకాల ఓటర్లే నోటిఫైడ్ ఓటర్లుగా ఉన్నారు. తాజాగా 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతంపైన వైకల్యం ఉన్న దివ్యాంగులు, 13 రకాల అత్యవసర సేవల విభాగాల ఉద్యోగులనూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ జాబితాలో చేర్చింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వీరూ తపాలా ఓటు ఉపయోగించుకోవచ్చని సూచించింది.

నోటిఫైడ్ ఓటర్ల జాబితా విస్తరణ ఈసారి ఈసీ నోటిఫైడ్ ఓటర్ల జాబితాను విస్తరించింది. ఎన్నికల విధుల్లో ఉండే అత్యవసర సేవల విభాగం ఉద్యోగులనూ తాజాగా ఈ జాబితాలో చేర్చింది. ఏఏఐ (ఎయిర్‌ఫోర్ట్స్ అథారిటీ ఇఫ్ ఇండియా), భారతీయ రైల్వే, ఆర్టీసీ, బీఎస్ఎన్ఎల్, ఎఫ్‌సీఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా), ఏఐఆర్ (ఆల్ ఇండియా రేడియో), దూరదర్శన్, పీఐబీ (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో), విద్యుత్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, పౌరసరఫరాలు, అగ్నిమాపక శాఖలు, కేంద్ర ఎన్నికల సంఘం ధ్రువీకరించే పాత్రికేయు లు ఈ విభాగంలో ఉంటారు. ఈ ఉద్యోగులకు ఫారం 12డీని ఆయా సంస్థలే ఆర్వోల ద్వారా ఇప్పించి తపాలా ఓటు సదుపాయాన్ని కల్పిస్తాయి. ఇటీవల జరిగిన కర్నాటక ఎన్నికల నుంచే పైవారికి తపాలా ఓటు సేవలు అందుబాటులోకి వచ్చాయి.

పోలింగ్‌నకు ముందే ...

పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలన్నీ రాజకీయ పార్టీలకు ముందే వెళ్తాయి. పోలింగ్ తేదీకంటే ముందే ఆర్వో ఏవేని రెండు తేదీలిస్తారు. ఈ రెండు తేదీల్లో ఓటరుకు వీలైన రోజే ఓటు వేయొచ్చు. ఇందుకోసం ఓటరింట్లోనే పోలింగ్ కంపార్టుమెంటు ఏర్పాటు చేస్తారు. బ్యాలెట్ పేపరు చేతికిస్తారు. ఓటు వేసిన అనంతరం ఆ పత్రాన్ని చిన్న కవరు (ఫారం13బీ)లో ఉంచి దానికి సీలు వేసిన తర్వాత ఎన్నికల అధికారికి ఇవ్వాలి. ఓటు వేసినట్టు ధ్రువీకరణ పత్రం (ఫారం 13ఏ)పై సదరు ఓటరు సంతకం చేయాలి. పై




రెండింటినీ ఒక పెద్ద కవరు (ఫారం 13సీ)లో వేసి ఓటరు సమక్షంలోనే దాన్ని సీల్ చేస్తారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియోలో చిత్రీకరిస్తారు. ఈ తపాలా ఓట్ల కవర్లు ఆర్వోకు సాయంత్రానికే చేరతాయి.

7 వరకు స్వీకరణ...

నవంబరు 3 నుంచి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోరుతూ ఫారం 12 డీ దరఖాస్తులను స్థానిక ఆర్వోకు సమర్పించాల్సి ఉంది. వీటిని 7 వరకు మాత్రమే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి స్వీకరిస్తారు. వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించేందుకు తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తారు. నోటిఫైడ్ ఓటర్ల జాబితాలో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం సంబంధిత విభాగాలు నోడల్ అధికారుల ను నియమించుకొని, వారి వద్ద ఫారం 12 డీని అందుబాటులో ఉంచాలని ఈసీ ఇప్పటికే ఆదేశాలిచ్చింది.

ఎక్కువ మందికి ఇవ్వాలని...సర్వీసు (సైన్యంలో ఉద్యోగులు), ప్రత్యేక (రాష్ట్రపతి, ఇతర కార్యాలయ సిబ్బంది), ఎన్నికల విధుల్లోని ఉద్యోగులు, పీడీ యాక్టు కింద అరెస్టయిన వారు మాత్రమే నోటిఫైడ్ ఓటర్లు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 14,859 మంది తపాలా ఓటు ఉపయోగించుకున్నారు. ఇలా ఎక్కువ మంది ఓటు వేసేలా 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం మించి వైకల్యం ఉన్న దివ్యాంగులనూ ఈసీ ఈ జాబితాలో చేర్చింది. ఉమ్మడి జిల్లాలో వీరు మొత్తం 1.25 లక్షలున్నట్టు అంచనా. వీరిలో ఒక్క సూర్యాపేట జిల్లా వృద్ధులే 15,675 మంది. వీరెవరైనా తపాలా ఓటు వేసేందుకు ఇష్టపడితే ఫారం-12డీ ని బీఎల్వోలు వారిళ్లకే వెళ్లి ఇస్తారు. వీరు తమ ధ్రువపత్రాలతో రిటర్నింగ్ అధికారి(ఆర్వో)కి ఆ దరఖాస్తును అందజేయాలి. పోస్టల్ బ్యాలెట్ ఓటరుగా ఆర్వో ఆమోదం పొందిన వారికి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే అవకాశం ఉండదు.

# మిల్లుల్లోనే క్రయ, విక్రయాలు

జనగామ : జిల్లాలో వరి తర్వాత అధికంగా సాగు చేసే పంట పత్తి. అకాల వర్షాల కారణంగా ఈసారి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వచ్చే పరిస్థితి లేదని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రభుత్వ మద్దతు ధర మించి బహిరంగ మార్కెట్ విపణిలో రికార్డు స్థాయిలో ధరలు పలికాయి. గతేడాది ఆశించిన ధర లభించకపోవడంతో రైతులకు పంట గిట్టుబాటు కాలేదు. వేసవి ప్రారంభంలో ఏప్రిల్, మే, జులైలో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి. ఆ తర్వాత మూడు నెలలు చుక్క వాన జాడ కనిపించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో చేతికొచ్చిన పంటకైనా తగిన ప్రతిఫలం లభించేలా..మార్కెట్‌లో ప్రైవేటు రంగానికి పోటీగా సీసీఐ ఉండాలని రైతులు కోరుతున్నారు.

మిల్లులే యార్డులు.. ఆ ఏడాది జిల్లాలో సాధారణ కంటే సుమారు 25 వేల ఎకరాల్లో పత్తి సాగు తగ్గింది. దీనికి తోడు వాతావరణం అనుకూలించలేదు. దీంతో పంట దిగుబడి అంతంతమాత్రంగానే ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కనీస మద్దతు ధర లభించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి జిన్నింగు మిల్లుల్లోనే ఖరీదు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో జనగామ జిల్లాలో 13 మిల్లుల నుంచి దరఖాస్తులు అందాయి. ఇందులో 11 మిల్లులు కొనుగోలుకు అనుకూలమైనవిగా ప్రాథమికంగా ఎంపిక చేసింది.. తూనికలు, కొలతలు, అగ్నిమాపక శాఖలు మొదటి పరీక్షలో ఏ ఒక్క మిల్లు నిబంధనలకు అనుగుణంగా లేవని నిర్ధారించాయి. ఇందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని మిల్లర్లుకు నిరభ్యంతర పత్రం ఇచ్చింది. ఫైర్ వ్యవస్థ నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో ఏ ఒక్క మిల్లుకూ ఎన్‌వోసీ లభించలేదు.

యార్డు నామమాత్రం.. జనగామ మార్కెటింగ్ శాఖ పరిధిలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల, పాలకుర్తి మార్కెట్ కమిటీలున్నాయి. జనగామ యార్డు క్రమబద్ధీకరణ విధానంలో నడుస్తోంది. స్టేషన్‌ఘన్‌పూర్ సీజనల్ మార్కెట్‌గా, మరో రెండు నాన్ ఫంక్షనల్




మార్కెట్లుగా కొనసాగుతున్నాయి. గతంలో యార్డుల్లోనే పత్తి క్రయ, విక్రయాలు జరిగేవి. జనగామ మార్కెట్ పరిధిలో కాయితాపురం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని మార్కెట్ కమిటీ హయాంలో సుమారు 3 ఎకరాల స్థలంలో రూ.3 కోట్ల వ్యయంతో పత్తియార్డును నిర్మించారు. అగ్నిప్రమాద నిరోధక వ్యవస్థ, రైతులకు ఆన్‌లైన్ సేవలందించే ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. సంచుల్లో పత్తిని విక్రయించడంతో ఖరీదు ప్రక్రియ సజావుగా జరగడం లేదనే కారణంతో ఐదేళ్లుగా యార్డులో కాకుండా మిల్లులోనే క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. మిల్లులకు దూరంగా, దిగుబడి తక్కువగా ఉన్న రైతులు యార్డుల్లో అమ్ముకునే అవకాశాలు లేవు. ఇదే అదనుగా చిల్లర కాంటా వ్యాపారులు తూకంలో, ధరలో చేతి వాటం ప్రదర్శించి రైతులను దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో క్రయ, విక్రయాలను అధికారులు ప్రారంభించలేదు.

మిల్లుల్లోనే ఖరీదు– నరేందర్, జనగామ జిల్లా మార్కెటింగ్ అధికారి జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి ఖరీదుకు ప్రాథమిక ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎంపిక చేసిన మిల్లుల్లో నిబంధనల మేరకు సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాం. దళారుల ప్రమేయాన్ని తగ్గించి, రైతులకే మద్దతు ధర లభించేలా పకడ్బందీ చర్యలుంటాయి. యార్డుల్లో ఖరీదుకు అవకాశం లేదు. అదనపు రవాణా ఖర్చులు తదితర ఇబ్బందుల నేపథ్యంలో మిల్లులను ఎంపిక చేశాం. ఉన్నతాధికారులను సంప్రదించి పత్తి కొనుగోలు సమాచారం రైతులకు తెలియపరుస్తాం.

# కొత్త 'నంబర్ల'పై ఓటర్లకు అవగాహన

భూపాలపల్లి: పాత ఓటరు గుర్తింపు కార్డుల్లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది.. చాలా ఏళ్ల కిందట జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డుల ఎపిక్ నంబరులో కొత్త ప్రామాణిక సీరీస్, అంకెలను కేటాయించారు. ఆయా ఓటర్లకు సంబంధిత అధికారులు బీఎల్‌వోల ద్వారా సమాచారం అందిస్తున్నారు. కొత్త ప్రామాణిక సిరీస్ ఆధారంగా తమ పేరు, పోలింగ్ కేంద్రాల వివరాలను తనిఖీ చేసుకోవాలని సూచిస్తున్నారు. రాష్ట్రంలో కొన్నేళ్లుగా వివిధ సిరీస్‌లతో ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేశారు. పాత గుర్తింపు కార్డులను 'ఏపీ సిరీస్'తో కేటాయించారు. ఈ గుర్తింపు కార్డులతో అన్ని రకాల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఏపీ సిరీస్‌తో ప్రారంభమై 14 అంకెలు ఉండేవి.. ఇప్పుడు కొత్త కార్డుల్లో పది అంకెలతో మార్పు



చేశారు. ఉదాహరణకు గతంలో భూపాలపల్లి మండలానికి చెందిన ఓటరుకు ఏపీ 82390తో మరో ఏడు అంకెలు కలిగిన ఓటరు గుర్తింపు కార్డు ఉండగా.. ప్రస్తుతం ఆ ఓటరు పేరిట ఆర్‌జేజెడ్ సీరీస్ కేటాయించి మరో ఏడు అంకెలతో మార్పు చేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలో మొత్తం 2,68,028 మంది ఓటర్లున్నారు. ఇందులో పాత సిరీస్‌తో ఓటరు గుర్తింపు కార్డులున్నవారు 64,253 మందిగా గుర్తించి, వారికి కొత్త సిరీస్‌తో ఓటరు గుర్తింపు కార్డులను కేటాయి ంచారు. ఇలా అన్ని నియోజకవర్గాల్లో జారీ చేశారు. ఓటరు గుర్తింపు కార్డులో మార్పు జరిగిందని లేఖల రూపంలో సంబంధిత బీఎల్‌వోలు సమాచారం ఇస్తున్నారు. కొత్త సిరీస్‌తో మార్పు చేసిన ఓటరు గుర్తింపు కార్డు ఇప్పట్లో చేతికందే వీలు లేకపోవడంతో అధికారులు అందించిన లేఖ ద్వారా కూడాహక్కు వినియోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

# నిమిషం నిడివిలో.. నిజం తెలుసుకో..!




పరకాల: ఎన్నికలు రాగానే అన్ని పార్టీల అభ్యర్థులకు ఓటర్లు దేవుళ్లలా కనిపిస్తారు. వారి ఓటు కోసం ప్రలోభాలకు గురిచేస్తుంటారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఓటు విలువపై ఓటర్లను చైతన్య పరిచే రీల్స్ సామాజిక మాధ్యమాల్లో ఎన్నో వస్తున్నాయి. నిజాయతీగా ఓటేస్తే వారికున్న గౌరవం ఎలా ఉంటుంది.. నోటుకు ఓటు అమ్ముకుంటే వారి పరిస్థితి ఎలా ఉంటుందో.. పిల్లలు, యువత సృజనాత్మకంగా రీల్స్ షూట్ చేస్తూ.. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. కేవలం 30 నుంచి 60 సెకన్ల నిడివి గల 'రీల్స్' ఓటర్లను ఆలోచింపజేసేలా ఉంటున్నాయి..

మనిషిని వెలకట్టి వివరిస్తూ..మూగజీవాల విలువ, మనిషి విలువను పోలుస్తూ ఓ మహిళ ఓటు విలువపై తీసిన రీల్స్ ఆకట్టుకుంటోంది. ఆమె మాటల్లో.. 'మార్కెట్లో గేదె విలువ రూ.80 వేలంట.. ఎద్దు విలువ రూ.50 వేలంట.. పొట్టేలు విలువ రూ.10 వేలు, కుక్క విలువ రూ.5 వేలు ఉంటుంది, పంది విలువ కూడా రూ.3 వేల నుంచి రూ.5 వేలు అంట.. వీటి విలువలన్నీ మాకెందుకు సామి అని అనుకుంటున్నారా? బరాబర్ ముచ్చటే.. మరి ఎన్నికల్లో తనను తాను విక్రయించుకుంటున్న మనిషి విలువ రూ.500 నుంచి రూ.1000.. అంతేనా.. అర్థం కాని విషయమేమిటంటే.. పందికి ఉన్న విలువ కూడా మనిషికి లేకుండాపోయె కదా.. మీ విలువైన ఓటును దయచేసి అమ్ముకోకండి.. విలువైన వ్యక్తులకు ఓటేయండి..' అంటూ ఆమె రెండు చేతులు జోడించి ప్రార్థించి రీల్ ముగించారు.

కామన్ మ్యాన్.. అవినీతి గురించి.. 'కామన్ మ్యాన్ ఏం క్లీన్ కాదు బ్రదర్.. ఈజ్ ద మోస్ట్ కరప్టెడ్ పార్ట్ ఆఫ్ ద సిస్టం. పవర్‌లో ఉన్న పొలిటీషియన్ కన్నా.. ఓటేసే ఓటరులోనే ఎక్కువ అవినీతి ఉంది. ఫ్రీగా ఇళ్లిస్తాం.. కరెంటిస్తాం.. రుణాలు మాఫీ చేస్తాం.. ఓటుకు రూ.5 వేలిస్తాం.. అనగానే ముందు వెనకా ఆలోచించకుండా ఓటేసి.. అవినీతి లేని సమాజం కావాలి, కరప్షన్ లేని కంట్రీ కావాలంటే ఎక్కడినుంచి వస్తాయి. కంట్రీ మారాలన్నా, కరప్షన్ పోవాలన్నా.. ముందు కామన్ మ్యాన్ మారాలి. మీరు మారాలి.. అంటూ నిమిషం పాటు నిడివితో సినిమా డైలాగుల మాదిరి వస్తున్న వీడియోలు ఓటరును చైతన్య పరుస్తున్నాయి.


యువత అశ్రద్ధ చేయొద్దు : – రచ్చరవి, టీవీ, సినిమా నటుడు

న్యూస్‌టుడే, శివనగర్ : మాది హనుమకొండలోని వేయి స్తంభాల గుడి ప్రాంతం. నేను టీవీ, సినిమా నటుడిగా ఎంత పనిఒత్తిడిలో ఉన్నా పోలింగ్ రోజు తప్పనిసరిగా హనుమకొండకు వచ్చి నాకు ప్రజాస్వామ్యం ఇచ్చిన ఓటు హక్కును వినియోగించుకుంటా. నాకు ఓటుహక్కు వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏనాడూ ఓటు వేయకుండా ఉండలేదు. ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలి. యువత ఈ విషయంలో అశ్రద్ధ చేయొద్దు. మనం వేసుకునే చెప్పులు, దుస్తులు కొనడానికి చాలా ఆలోచిస్తాం. రంగు, డిజైన్, నాణ్యతను చూస్తాం. ఐదేళ్లు మనల్ని పాలించే నాయకుడిని ఎన్నుకునే ఓటు హక్కు వినియోగంలో మరింతగా ఆలోచించాలి.

డబ్బు తీసుకుంటే అగౌరవమే ఎన్నికల్లో పది, పరకా తీసుకొని ఓటేస్తే తర్వాత నాయకుడిని ఏ సమస్యపైనా అడగలేరు. గెలిచిన తర్వాత నాయకుడు ఓటరును ఏ మాత్రం గౌరవించడు. డబ్బును తిరస్కరించి నచ్చిన వ్యక్తికి ఓటేస్తే గెలుపొందాక నాయకులు సైతం గౌరవిస్తారు. ఈ అంశంపై అయిదారుగురు చిన్నారులు చిన్న రీల్ చేశారు. ఒక ఊరిలో డబ్బులిస్తేనే ఓటేస్తానని ఓ వ్యక్తి డిమాండ్ చేస్తారు. అక్కడే ఉన్న మరొక ఓటరు.. నా ఓటు విలువ నాకు తెలుసు. ఓటు అమ్ముకునే రకం కాదు.. అంటూ తిరస్కరిస్తారు. ఎన్నికలు పూర్తయ్యాక గెలిచిన నాయకురాలి దగ్గరకు డబ్బు తీసుకుని ఓటేసిన వ్యక్తి వచ్చి.. తనకు ప్రభుత్వ పథకం ద్వారా ఇల్లు కట్టించమని అడిగితే.. ఎన్నికలప్పుడు డబ్బులు తీసుకున్నావు.. అసలు నీ ఓటు ఎవరికి వేశావో తెలియదు.. ఇక్కడి నుంచి వెళ్లిపోమంటూ..ఆ నాయకురాలు అమర్యాదగా మాట్లాడుతారు. డబ్బులు తిరస్కరించిన ఓటరు వచ్చి నల్లా కనెక్షన్ కావాలని అడిగితే కుర్చీ వేసి కూర్చోమని గౌరవిస్తారు. మీరు ఇంటికి వెళ్లండి.. మీ పని అయిపోతుందని చెబుతారు. ఓటరు ప్రలోభాలకు లొంగితే మర్యాదను కూడా కోల్పోవాల్సి వస్తుందని సందేశాత్మకంగా బాలబాలికలు తీసిన రీల్స్ ఆసక్తికరంగా ఉంది.

చాలా విషయాలు తెలుస్తున్నాయి– చిటికేసి రోషిణి, తొలి ఓటరు, హనుమకొండఈసారి ఎన్నికల్లో తొలి ఓటు వేసే అవకాశం వచ్చింది. నాకు రాజకీయాలపై పెద్దగా అవగాహన లేదు. సామాజిక మాధ్యమాల్లో ఓటర్లను చైతన్యపరిచేలా అనేక రీల్స్ వస్తున్నాయి. సమాజంలో ప్రజలు ఎలా ఉన్నారు.. రాజకీయ నేతలు ఎలా ప్రలోభాలకు గురి చేస్తుంటారు.. తదితర అనేక విషయాలు తెలుస్తున్నాయి. ఎవరికి ఓటేయాలి.. ఎలా వినియోగించుకోవాలి.. తదితర అంశాలు రీల్స్ ద్వారా చూసి అర్థం చేసుకున్నాను.

# పోరాటాల ఖిల్లా.. పరకాల



పరకాల: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటంలో పరకాల మరో జలియన్ వాలాబాగ్‌గా నిలిచింది. పాత తాలుకా కేంద్రంగా ఒకప్పుడు విరాజిల్లిన ఈ ప్రాంతం నాడు నక్సల్స్ ఉద్యమానికి కేంద్ర బిందువుగా నిలిచింది. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెరతోపాటు వరంగల్ జిల్లాలోని గీసుకొండ, సంగెం మండలాలున్నాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలో (మూడు) డివిజన్లు, ఒక మున్సిపాలిటీ, 109 గ్రామపంచాయతీలున్నాయి. 2009లో నియోజకవర్గ పునర్విభజనలో ఎస్సీ స్థానంగా ఉన్న పరకాల జనరల్‌గా మారింది. అప్పటివరకు ఈ నియోజకవర్గంలోనే ఉన్న భూపాలపల్లి, చిట్యాల, రేగొండ, మొగుళ్లపల్లి మండలాలు ప్రస్తుత భూపాలపల్లి నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి.

నియోజకవర్గం ముచ్చట

1952లో పరకాల నియోజకవర్గ కేంద్రంగా ఏర్పడింది. 1972 వరకు జనరల్ స్థానంగా కొనసాగింది. ః 1978 నుంచి 2009 వరకు ఎస్సీకి రిజర్వుడు. 2009 నుంచి జనరల్ స్థానంగా కొనసాగుతోంది. ః 1957లో ద్విసభ్య ఎన్నికలతో ఇక్కడ ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారు. ః ఇక్కడ ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారిలో పింగిళి ధర్మారెడ్డి, బొచ్చు సమ్మయ్య, కొండా సురేఖ మంత్రులుగా పని చేశారు. ః మొత్తం 16 పర్యాయాలు ఎన్నికలు జరగగా 13 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో బొచ్చు సమ్మయ్య, ఒంటేరు జయపాల్, చల్లా ధర్మారెడ్డి వరుసగా రెండు పర్యాయాలు విజయకేతనం ఎగురవేశారు. పరకాల ఎమ్మెల్యేగా గెలుపొందిన పరకాలవాసి స్వర్గీయ చందుపట్ల జంగారెడ్డి హనుమకొండ ఎంపీగా సైతం గెలుపొందారు.

స్వరూపం – హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలకు పరకాల ప్రధాన కేంద్రంగా నిలిచింది. హుజురాబాద్, భూపాలపల్లి, హనుమకొండకు ఎటు వెళ్లాలన్నా 35 కిలోమీటర్ల దూరం. మహారాష్ట్ర సిరివంచ వెళ్లే జాతీయ రహదారి(353 సి) కూడా పరకాల మీదుగానే ఉంది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పరకాల ప్రాంతంలో సాగిన పోరాటంలో అమరులైన వారి చిహ్నంగా అమరధామం నిర్మించారు. పరకాల భవానీ సమేత కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో ఏటా షష్ఠి జాతర నిర్వహిస్తుంటారు. కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ప్రసిద్ధి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఉంది కీర్తినగర్ పారిశ్రామిక ప్రాంతంలో తయారయ్యే పసుపు, కారంపొడి వంటి ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. గంగదేవిపల్లి, మరియపురం దేశంలోనే ఆదర్శ గ్రామపంచాయతీలుగా అవార్డులు అందుకున్నాయి.

నియోజకవర్గంలో ప్రధానంగా పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న, కూరగాయలు వంటి పంటలను రైతులు పండిస్తున్నారు. ఎస్సారెస్పీ కాల్వలు, చలివాగుతోపాటు పెద్ద చెరువులు వంటివి నీటి వనరులు.

# సైగలతో చెబుతూ.. అర్థం వివరిస్తూ!

పరకాల: వారికి వినపడదు.. సైగలతో అర్థం చేసుకుంటారు. తెలుసుకోవాలనే ఆతృత... ఓటు హక్కు లేకున్నా ఓటింగ్ ప్రక్రియ ఎలా ఉంటుందో చూడాలనే ఉత్సాహం. బధిరులైన విద్యార్థులు ఓటింగ్, వివిధ అంశాలపై వినూత్నమైన రీతిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధ్వర్యంలో కాజీపేట ప్రగతినగర్‌లోని టీటీడీ శ్రీవేంకటేశ్వర బధిరుల పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ జె.లక్ష్మినర్సమ్మ ప్రత్యేక చొరవతో ఉపాధ్యాయ బృందం రమణయ్య, సుప్రసన్నాచారి, శోభారాణి, శరత్ కళ, వెంకటలక్ష్మి, యాకయ్య, నవీన్, స్వామి, సంతోష్, అనూష, జ్యోత్స్న, చరణ్ సింగ్ సహకారంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రలోభాలకు లొంగకుండా పనిచేసే అభ్యర్థికి ఓటు వేయాలని ఉపాధ్యాయులు అర్థమయ్యేలా చెబుతుంటే విద్యార్థులు తమ హావభావాలతో అర్థవంతంగా వివరించారు.



# ఊపిరాడనీయడం లేదు!

సిరిసిల్ల : సిరిసిల్ల డంపింగ్ యార్డుతో ప్రజలకు పలు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కుప్పలు, కుప్పలుగా పేరుకుపోయిన చెత్త నుంచి ఏకధాటిగా మంటలు రావడంతో దట్టమైన పొగ వ్యాపించి వాయు కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు తేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో పట్టణ ప్రజలు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. తరచూ ఇలా జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. చివరకు కలెక్టర్ అనురాగ్ జయంతి ఇద్దరు మున్సిపల్ అధికారులపై వేటు వేస్తేగానీ చలనం రాని దుస్థితి నెలకొంది.

సిరిసిల్లలోని డంపింగ్ యార్డును 2011 సంవత్సరంలో 15 ఎకరాల్లో నిర్మించారు. పారిశుద్ధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరు పద్ధతుల్లో సేకరించి యార్డుకు తరలిస్తున్నారు. రోజుకు 37 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. 45 మున్సిపల్ వాహనాల ద్వారా చెత్తను సేకరిస్తున్నారు. మొత్తం 271 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. మున్సిపల్ అధికారులు డంపింగ్ యార్డులోని తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. కూరగాయల మార్కెట్ వ్యర్థాలతో ఎండో కంపోస్ట్, ఇళ్లలో నుంచి సేకరించిన వాటితో వర్మీ కంపోస్ట్‌ను తయారు చేస్తున్నారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేస్తూ పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపిస్తారు. మిగిలిన డ్రైనేజీ చెత్త కుప్పలను బయోమైనింగ్ చేస్తారు. దీనివల్ల చెత్తంతా పొడిగా మారి భూమిలో కలుస్తుంది. భూమిలో కలవని చెత్తను మళ్లీ రీసైక్లింగ్‌కు పంపిస్తారు. ఇలా వ్యర్థాలను వృథాగా పోకుండా రీసైక్లింగ్ చేస్తూ, ఎరువును తయారు చేస్తూ సిరిసిల్ల డంపింగ్ యార్డు ప్రశంసలు



అందుకుంది. అయితే ఇటీవల అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అయిదు రోజులపాటు..

ఇటీవల జరిగిన బతుకమ్మ వేడుకల సమయంలో డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త నుంచి మంటలు వచ్చి దట్టమైన పొగతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఏకధాటిగా అయిదు రోజుల పాటు వచ్చిన పొగ సిరిసిల్లవాసులను ఆందోళనకు గురిచేసింది. రెండు రోజులకు గానీ మున్సిపల్ అధికారులకు ఈ విషయం తెలియలేదు. దీన్నిబట్టి ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది ఊహించవచ్చు. సమాచారం అందుకున్న తరవాత విశ్వప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. అయిదు రోజుల తరవాత వరకూ మంటలు ఆగలేదు. అగ్నిమాపక వాహనం వచ్చినా లాభం లేకపోయింది. అయితే వర్షాల వల్ల బయోమైనింగ్ ఆలస్యమైందని, లేకపోతే ఈ సమస్య తలెత్తేది కాదని అధికారులు చెబుతున్నారు. భూమి, నీటి కాలుష్యాలను నివారిస్తున్న డంపింగ్ యార్డు వాయు కాలుష్యానికి కారణం కాకూడదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందని ఆందోళన చెందారు.

పునరావృతం కాకుండా చర్యలు

ఇటీవల సిరిసిల్ల డంపింగ్ యార్డులో ప్రమాదవశాత్తు చెత్తకు నిప్పు అంటుకొని అయిదు రోజుల పాటు ఏకధాటిగా మంటలు వచ్చాయి. దీంతో దట్టమైన పొగ వ్యాపించింది. తడి చెత్తతో ఎరువు తయారు చేస్తున్నాం. పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపగా మిగిలిన చెత్తను బయోమైనింగ్ చేస్తాం. వర్షాల కారణంగా బయోమైనింగ్ ఆలస్యమైంది. లేని పక్షంలో ఇలా జరిగేది కాదు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.మీర్జా ఫసహత్ అలీ బేగ్, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్

# కల్లాల్లోకి ధాన్యం.. కొనుగోళ్లు లేని దైన్యం

జగిత్యాల : జిల్లా వ్యాప్తంగా పది రోజుల నుంచి వరి కోతలు ప్రారంభం కాగా రైతులు ధాన్యాన్నితెచ్చి కేంద్రాల్లో ఆరబోస్తున్నా రు. ఈ సీజన్‌లో పక్షం రోజుల ముందుగానే వరినాట్లు వేయటంతో ముందస్తుగానే వరికోతలు ప్రారంభమై ధాన్యం కల్లాలకు వస్తుండగా కొనుగోళ్లను ప్రారంభించాల్సి ఉంది. నిరుడు వానాకాలంలో ఆలస్యపు సేకరణ, అకాల వర్షాలు తదితరాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న దృష్ట్యా ఈసారి సజావుగా సేకరణ చేపట్టాల్సి ఉంది.

ముందస్తు చర్యలు అవసరం

జిల్లాలో 400 ప్యాక్స్, ఐకేపీ, మెప్మా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించటం సమస్యగా మారనుంది. గత రెండు సీజన్లకు చెంది ఇంకనూ 3.62 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ కింద మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా ఈ జాప్యం సేకరణపై పడకుండా చూడాల్సి ఉంది. కనీసం 70 శాతం బియ్యాన్నిచ్చిన మిల్లులకే ధాన్యాన్ని కేటాయించనున్నందున ఈసారి కేటాయింపు మిల్లుల సంఖ్య తగ్గనుండగా ఇతర జిల్లాల్లోని మిల్లులకు ధాన్యాన్ని తరలించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలి.

గత సీజన్‌లో తరుగు సమస్య

హార్వెస్టర్లతో నూర్పిడి చేసిన ధాన్యం సాధారణంగా నాణ్యతగానే ఉంటుంది. మరోసారి ప్యాడీక్లీనర్‌తో శుభ్రం చేయిస్తున్నా, ధాన్యం నాణ్యతను ఏఈవోలు ధ్రువీకరించినా గత సీజన్‌లలో చాలామంది మిల్లర్లు తరుగు తీశారని.. ఈ సీజన్‌లో తరుగు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం సేకరణ నిమిత్తం వెచ్చించే ఖర్చు పరిమితిని పెంచాలని, కమీషన్‌ను సకాలంలో విడుదల చేయాలని కేంద్రాల నిర్వాహకులు కోరుతున్నారు. తగినన్ని గన్నీ సంచులను ముందుగానే తెప్పించాల్సి ఉంటుంది. మరోవైపు ధాన్యం వచ్చిన కేంద్రాలను త్వరలోనే ప్రారంభిస్తామని డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు వెల్లడించారు.

రైతుల విన్నపాలు ఇవి..వర్షాలుంటే ధాన్యాన్ని కాపాడుకునేలా రాయితీపై టార్పాలిన్లు ఇవ్వాలి.ప్రతి కేంద్రానికి కనీసం 50–100 టార్పాలిన్ షీట్లను అందుబాటులో ఉంచాలి.ధాన్యం మేలు రకాలకు క్వింటాకు రూ.2,203, సాధారణ రకాలకు రూ.2,183 మద్దతు ధర ఉండగా.. డబ్బుల చెల్లింపులో జాప్యం జరగకుండా చూడాలి.జిల్లాలో ఇలా.. కనీస దిగుబడి అంచనా : 4 లక్షల మెట్రిక్ టన్నులుఈ వానాకాలంలో మొత్తం వరిసాగు : 3.06 లక్షల ఎకరాలుఏర్పాటు చేయనున్న కేంద్రాల సంఖ్య : 400

వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి అన్నిచోట్ల వరికోతలు చేపట్టి పెద్దఎత్తున ధాన్యాన్ని కల్లాలకు తెస్తున్నారు. వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి. .బస్తాలను ఎప్పటికప్పుడు తరలించేలా చూడాలి. మిల్లుల్లో మళ్లీ తరుగు తీయకుండా చూడాలి.గంగారెడ్డి, రైతు, గుల్లపేట

# సాంకేతిక సాగుబడి

ఖమ్మం : వ్యవసాయ రంగంపై ఆసక్తి.. సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలవాలనే ఆకాంక్ష.. అలాంటి యువతకు సాగు పాఠాలు చెపుతూ కొలువులకు దారి చూపుతోంది మధిరలోని ప్రభుత్వ వ్యవసాయ సాంకేతిక కళాశాల. ఇక్కడ కోర్సు పూర్తి చేసిన అత్యధికులు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందారు. కళాశాల అభ్యర్థులు అగ్రిసెట్‌లో అత్యధిక సీట్లు సాధించి రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చారు. త్వరలో పాలిటెక్నిక్ పరీక్ష జరగనున్న నేపథ్యంలో కళాశాల గురించి కథనం..

ఏఈవో కొలువుల సాధన

కళాశాలలో ఇప్పటివరకు దాదాపు 220 మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేశారు. వీరిలో 25 మందికి పైగా వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో)గా కొలువులు సాధించగా మరికొంత మంది ప్రయివేటు కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. కళాశాలకు అనుబంధంగా అపరాల పరిశోధన కేంద్రముంది. పంటల క్షేత్రపర్యటనకు ఎంతగానో దోహదపడుతోంది.

అగ్రిసెట్ అరవై సీట్లలో పది మధిరకే..

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 ప్రభుత్వ, ప్రయివేటు వ్యవసాయ సాంకేతిక కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో కోర్సు పూర్తి చేసిన దాదాపు 11,00 మంది విద్యార్థులు గతేడాది రాష్ట్రంలోని అరవై సీట్లకు ప్రవేశ పరీక్ష అగ్రిసెట్ రాశారు. వీరిలో మధిరలో గత ఏడాది సాంకేతిక విద్య పూర్తి చేసిన పది మంది సీట్లు సాధించగా మరో ఇద్దరు రెండేళ్ల కిందట ఇక్కడ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు సీట్లు పొందటం విశేషం. వీరందరికి రాజేంద్రనగర్, అశ్వారావుపేట, వరంగల్ తదితర వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు లభించాయి.

అయిదేళ్లుగా రైతులకు సేవలు అందిస్తున్నా: శివకృష్ణ, ఏఈవో పాపటపల్లి2017లో రెండోసారి సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి వ్యవసాయ విస్తరణ అధికారిగా ఎంపికయ్యాను. రఘునాథపాలెం మండలం పాపటపల్లి క్లస్టర్‌లో విధుల్లో చేరి అయిదేళ్లుగా రైతులకు సేవలందిస్తున్నాను. కళాశాలలో ప్రయోగాలన్నీ పోటీ పరీక్షలో ఉద్యోగం సాధించేందుకు ఎంతో ఉపకరించాయి.

కళాశాల ప్రస్థానమిదీ..

మధిరలో వ్యవసాయ సాంకేతిక కళాశాలను 2011-12లో స్థాపించారు. ఉమ్మడి జిల్లాలో ఏకైక ప్రభుత్వ కళాశాల ఇది. ఇక్కడ రెండేళ్ల డిప్లొమా కోర్సులో మొత్తం 44 సీట్లు ఉంటాయి. అందులో ప్రథమ 22 మంది, ద్వితీయ సంవత్సరం 22మంది అభ్యసిస్తారు. పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసిన అభ్యర్థులకు ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. మధిరలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆవరణలోనే ఈ కళాశాల ఉండటం మరో ప్రత్యేకత. యాభై ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన కేంద్రంలో విత్తనం నుంచి కలుపు, పంట కోతల వరకు విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం ద్వారా బోధన జరుగు తుంది. సాగు పనులు చేస్తూనే పరిజ్ఞానం పొందుతారు. అందువల్లే ఇక్కడి విద్యార్థులు ఉన్నత చదువులతోపాటు కొలువుల సాధనలో ముందుంటున్నారు.

కీటక శాస్త్రవేత్త కావాలనేదే లక్ష్యం గండికోట శ్రుతి, ఖమ్మం

వరంగల్ వ్యవసాయ కళాశాలలో అగ్రిసెట్ సీటు సాధించా. వ్యవసాయ రంగంలో డాక్టరేట్ పొందాలనేదే లక్ష్యం. ఆ తర్వాత కీటకశాస్త్ర నిపుణురాలిగా రైతులకు సేవలందించాలని ఆకాంక్ష. మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తారు. అన్నదాతలకు వ్యవసాయ రంగంలో సేవలందించేందుకు పాటుపడతా.

ప్రతి అంశం క్షేత్రస్థాయికి అందిస్తా మేకల హారిక, కొత్తగూడెం

మాది మధ్య తరగతి కుటుంబం. వ్యవసాయం అంటే ఎంతో ఇష్టం. పీహెచ్‌డీ పూర్తి చేసి శాస్త్రవేత్తగా ఎదగాలన్నది లక్ష్యం. అధునాతన పద్ధతులు రైతులకు తెలియజేస్తూ అధిక ఉత్పత్తులు సాధించేలా కృషి చేస్తా. కళాశాలలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడేలా పనిచేస్తా.

కళాశాలలో చేరిన విద్యార్థులకు భవిష్యత్తు ప్రణాళిక, అనుకున్న ఆశయాలను సాధించడానికి కావలసిన శిక్షణ ఇస్తున్నాం. ప్రధానంగా ప్రయోగాలు పొలాల్లోనే నిర్వహిస్తాం. పంటలకు తెగుళ్లు, అధిక దిగుబడుల సాధనకు చేపట్టాల్సిన అంశాలను బోధిస్తూనే, పంట క్షేత్రాల్లో వారితోనే ఇవన్నీ అమలు చేయిస్తాం. వసతి గృహాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. అధ్యాపకుల సమష్టి కృషి, సమగ్ర శిక్షణతో అగ్రిసెట్‌లో ర్యాంకులు, ఏఈవో కొలువులు సాధిస్తున్నాం. డా.కె.రుక్మిణీదేవి, కళాశాల ప్రధానాచార్యులు

# అన్నింటా అధిక లక్ష్యమే

కొత్తగూడెం : ప్రస్తుత ఉత్పత్తి సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో మాత్రమే కాకుండా రవాణాలోనూ సింగరేణి మంచి ఆరంభాన్ని నమోదు చేసింది. ఈ వార్షిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో ఉత్పత్తిలో 103 శాతం లక్ష్యాన్ని సాధించిన సంస్థ.. రవాణాలో 108 శాతం లక్ష్యం అధిగమించింది. ఉత్పత్తి 55.7 లక్షల టన్నులకు చేరుకోగా.. రవాణా 55.8కి గాను 60 లక్షల టన్నులుగా నమోదైంది. గతేడాది ఇదే నెలతో పోల్చిచూస్తే వృద్ధి 5.7 శాతంగా ఉంది. యాజమాన్యం మట్టి తొలగింపు పనులపైనా ప్రత్యేక దృష్టిసారించింది. గతేడాది ఏప్రిల్ కన్నా 12.6 శాతం వృద్ధిని సాధించడం విశేషం. 410 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాలని లక్ష్యం విధించగా..



ఏకంగా 422 లక్షల క్యూబిక్ మీటర్లు (102 శాతం) నమోదు చేశారు.

ప్రస్తుత నెల ఉత్పత్తి ఇలా..

ఉత్పత్తి: ఏప్రిల్‌లో బొగ్గు ఉత్పత్తి, రవాణా, మట్టి తొలగింపు పనుల్లో సంతృప్తికర ఫలితాలు సాధించడంతో 'మే' నెలలో అధిక మొత్తం లక్ష్యాలను నిర్దేశించుకొని సంస్థ ముందుకు వెళ్తోంది. 67.58 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రోజుకు కనీసం 2.20 లక్షల టన్నులు వెలికితీయాల్సి ఉంటుంది.

రవాణా: బొగ్గు తరలింపు లక్ష్యాన్ని సైతం ఏప్రిల్ కంటే (60 లక్షల టన్నులు) అధికంగా 70 లక్షల టన్నులకు పెంచారు. దీన్ని చేరాలంటే ప్రస్తుతం రోజుకు కనీసం 2.26 లక్షల టన్నులు రవాణా చేయాల్సి ఉంటుంది.బండ్: మట్టి తొలగింపు లక్ష్యాన్ని యాజమాన్యం పెంచింది. ఈ నెలలో 48.05 మిలియన్ క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాలని నిర్ణయించింది. ఈ లక్ష్యం చేరుకోవాలంటే రోజుకు కనీసం 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించాలి. ఈ మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అధికారులు కార్మికోద్యోగులను సన్నద్ధం చేస్తున్నారు.

# చెరువు నీరు.. నేల పాలు



వైరా : తిలా పాపం.. తలా పిడికెడు.. ఈ సామెత మత్స్య శాఖ, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలకు సరిపోలుతుంది. శాఖల మధ్య సమన్వయ లోపంతో పల్లెల్లోని సాగునీటి వనరులు వెలవెలబోతున్నాయి. సమయానికి ఎంతో కొంత నగదు ఇస్తే చాలు అక్రమాలన్నీ సక్రమాలు అయిపోతున్నాయన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో వేసవిలో విలువైన చెరువు నీటిని అక్రమంగా బయటకు పంపిస్తున్నారని స్థానికులు మొరపెట్టుకుంటున్నా స్పందన లేదు. పది రోజుల క్రితం జలకళతో ఉన్న జలాశయం నేడు వెలవెలబోతున్నా అధికారులకు కనిపించటం లేదు. ప్రశ్నిస్తే 'రాత్రి సమయంలో బయటకు తీస్తున్నారు. మేము వచ్చి అక్కడ కూర్చునేమా' అంటూ స్థానికులకు సమాధానమిస్తున్నారు. రాజకీయ ఒత్తిడి, అధికారుల నిర్లక్ష్యం మూలంగా జలాశయాలు అడుగంటి వేసవిలో భూగర్భ జలమట్టం తగ్గిపోతోంది.ఇలా చేయాల్సి ఉండగా..గ్రామాల్లో ఉన్న చేపల చెరువుల్లో మత్స్య శాఖ సభ్యులు చేపలు పెంచి, వారే పట్టుకుని ఆదాయం సమకూర్చుకోవాలి. సొసైటీలో సభ్యులుగా ఉండాలంటే వల విసరడం, తెప్ప నడపడం రావాలి. కానీ మత్స్య శాఖ అధికారులు ఈ నిబంధనలు పాటించకుండా పరిధిని మించి సభ్యులుగా తీసుకున్నారు. ఇలాంటి వారిలో కొందరికి వల విసరడం రాకపోవడంతో నీటిని బయటకు తరలించి చివరకు అడుగు నీటిలో లోపలకు నడిచి వెళ్లి చేపలు పడుతున్నారు. సులభంగా సాగాల్సిన వేట కోసం విలువైన నీటిని రాత్రి సమయంలో బయటకు తరలిస్తున్నారు. సొసైటీ వాళ్లే వ్యాపారం చేయాల్సి ఉండగా ఓ గుత్తేదారుకు వాటిని కట్టబెడుతున్నారు. వచ్చిన సొమ్మును సభ్యులకు తక్కువ మొత్తంలో ఇచ్చి మిగతా వాటిని ఆయా శాఖల అధికారులకు పంచుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో మత్స్యశాఖ తీరు అనేక వివాదాలకు మారుపేరుగా ఉంది.

ఎవరికి వారే..చెరువులో నీటి కట్టడికి నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలి. రెండు శాఖలు ఎవరికి వారే పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. నీటిపారుదల శాఖకు మండలాల స్థాయిలో డీఈ, ఏఈలున్నా సాగునీటి పరిరక్షణలో విఫలమవుతున్నారు. కొణిజర్ల, చింతకాని, రఘునాథపాలెం, బోనకల్లు, కల్లూరు తదితర మండలాల్లో చేపల చెరువుల్లో నీరు అడుగంటింది. నిన్నమొన్నటి వరకు సాగర్ జలాలతో కళకళలాడిన జలాశయాలు ఖాళీ అవుతున్నాయి. వాటికింద ఎలాంటి పంటలు లేకున్నా ఇదే పరిస్థితి.

మచ్చుకు కొన్ని... కొణిజర్ల చెరువులో చేపల వేట కోసం నీటిని బయటకు తీయడంతో అడుగంటింది. దీనిపై పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారుల్లో కదలిక లేదు. తల్లాడ ఏదుళ్ల చెరువు, ఇతరచోట్లా నీరు బయటకొదిలి వేట చేపట్టారు. వైరా మండల నల్లచెరువులో నీటి తరలింపు సమయంలో ఏటా రైతులు, సొసైటీ వాళ్లకు వివాదం చోటుచేసుకుంటోంది. కూసుమంచి, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, వైరా మండలాల్లో చాలాచోట్ల వెలవెలబోతున్నాయి. కొణిజర్ల, చింతకాని, ఏన్కూరు, మధిర మండలాల్లో సొసైటీ సభ్యుల సంఖ్య చెరువు విస్తీర్ణం కంటే అధికంగా ఉంది. అదనంగా తీసుకోవడంతో వివాదాలు చోటుచేసుకున్నాయి.

చేపల వేట కోసం నీటిని బయటకు పంపొద్దు. నీరున్నా కచ్చు వలల ద్వారా వేట సాగించొచ్చు. దీనిమీద సభ్యులకు అవగాహన ఉంటుంది. అనధికారికంగా చెరువుల నుంచి నీరు బయటకు పంపిస్తే మత్స్యసొసైటీ మీద చర్యలు తీసుకోవచ్చు. మా దృష్టికి వస్తే వెంటనే నీటిపారుదల శాఖకు నివేదించి చర్యలు కోరుతాం.

ఆంజనేయస్వామి, మత్స్యశాఖ ఏడీ

# తపాలా కొలువుల్లో మహిళా ముద్ర



ఖమ్మం : తపాలాశాఖ ఇటీవల గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టులను భారీగా భర్తీ చేసింది. ఖమ్మం తపాలా డివిజన్(ఉమ్మడి ఖమ్మం జిల్లా)లో ఈ ఉద్యోగాల్లో మహిళలు ఎక్కువగా ఎంపికయ్యారు. రెండేళ్లుగా జరిగిన నియామక ప్రక్రియలో మహిళలే అధికంగా ఉన్నారు. తపాలా డివిజన్‌లో 750 గ్రామీణ తపాలా కార్యాలయాలు మనుగడలో ఉన్నాయి. ఇందులో 1100 మంది గ్రామీణ్ డాక్ సేవక్‌లు పని చేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు ఈ సంఖ్య 530గా ఉంది. అప్పట్లో మహిళా ఉద్యోగుల సంఖ్య కూడా తక్కువ. గత ఏడాది 220 పోస్టులు భర్తీ చేశారు. ఇందులో అత్యధికంగా మహిళలే నియమితులయ్యారు. మొత్తంగా చూస్తే 1100 మంది జీడీఎస్‌లు పని చేస్తుండగా ఇందులో మహిళల సంఖ్య 364. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు పొందిన వారికి జీడీఎస్ ఉద్యోగం ఇచ్చే విధానాన్ని తపాలాశాఖ అమలు చేస్తోంది. ఇంజినీరింగ్, ఇతర ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న నిరుద్యోగులు, ఉద్యోగాల వేటలో అలసిన వారు.. చేస్తున్న ఉద్యోగాలు నచ్చక, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్నవారు జీడీఎస్‌లుగా చేరుతున్నారు. ఇందులో సహాయకులుగా చేరేవారికి కనీస వేతనం నెలకు పది వేలు, బీపీఎంలకు రూ.12 వేలు కనీసం వేతనంగా తపాలా శాఖ చెల్లిస్తోంది. పని భారాన్ని బట్టి వేతనాలు పెరిగే సదుపాయం ఉంది.

విస్తృతమవుతున్న శాఖ

తపాలా శాఖలో తపాలా బ్యాంకు సదుపాయం వచ్చాక కార్యకలాపాలు మరింత విస్తృతమయ్యాయి. లెఫ్ట్‌వింగ్ పథకంలో భాగంగా గత ఏడాది నుంచి 220 అదనపు గ్రామాలకు తపాలా సేవకులు చేరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం పట్టణాల్లో ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా 69 ఉప, 750 గ్రామీణ కార్యాలయాలు పని చేస్తున్నాయి.

ఐటీ ఉద్యోగం వదిలేసి...ఇంజినీరింగ్ చదువు పూర్తి చేసుకొన్న ఓ యువతి తపాలా శాఖలో జీడీఎస్ ఉద్యోగంలో చేరింది. ఆమె ఖమ్మం నగరంలోని తపాలా కార్యాలయంలో పోస్టు ఉమెన్ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. 'ఐటీ ఉద్యోగంలో రాత్రిళ్లు పని చేయాల్సి వస్తోంది. ఏదైనా మరో ఉద్యోగానికి సిద్ధం కావానుకుంటే సమయం కుదరడం లేదు. దీంతో వదిలేసి జీడీఎస్‌గా చేరా.. 5 గంటల పని ఉంటుంది. పూర్తి చేసుకుంటే నెలకు కనీస వేతనం, తగిన సమయం లభిస్తోంది. అందుకే ఇందులో చేరానని' సదరు యువతి తెలిపారు. ఈ కోణంలో చూస్తూ జీడీఎస్‌లుగా చేరిన మహిళలు చాలామంది ఉన్నారు. ఏ గ్రామంలో దరఖాస్తు చేసుకుంటే అర్హులు అక్కడే ఉద్యోగం పొందే అవకాశం ఉన్నందున ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని తపాలా అధికారులు వివరించారు.

# రూ.71.35 కోట్లతో మెప్మా వార్షిక ప్రణాళిక

ఖమ్మం : ఖమ్మం జిల్లాలోని పుర, నగర పాలకాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీ, వీధి వ్యాపారులు, దివ్యాంగుల సంఘాల రుణ లక్ష్యాల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తద్వారా 749 స్వయం సహాయ సంఘాలు, ఏడు దివ్యాంగుల సంఘాలు, పది వీధి వ్యాపారుల సంఘాలు లబ్ధి పొందనున్నాయి. గత ఏడాది 1036 సంఘాలకు రూ.105.43 కోట్లు రుణ లక్ష్యం కాగా, 1,236 సంఘాలకు రూ.112.83 కోట్లు మంజూరు చేశారు. ఈ ఏడాది కొత్తగా 29 సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఖమ్మం నగరపాలకంలో మూడు దివ్యాంగ సంఘాలకు రూ.9 లక్షలు, మధిరలో ఒక సంఘానికి రూ.4 లక్షలు, సత్తుపల్లిలో రెండు సంఘాలకు రూ.6 లక్షలు, వైరాలో ఒక సంఘానికి రూ.3 లక్షలు రుణాలు ఇవ్వనున్నారు.



ఖమ్మంలో ఆరు వీధి వ్యాపారుల సంఘాలకు రూ.16 లక్షలు, సత్తుపల్లిలో 4 సంఘాలకు రూ.14 లక్షలు మంజూరు చేయనున్నారు.

# మతలబేంటి..!

భద్రాచలం : ప్రభుత్వం ప్రకటించే ఉద్యోగ నోటిఫికేషన్లలో గిరిజన నిరుద్యోగులు ఎంపిక కావాలంటే వారు పోటీని ఎదుర్కొనగలగాలి. ఇందుకోసం తగిన శిక్షణ ఉండాలి. ఐటీడీఏ పరిధిలోని గిరిజన యువత కోసం పోటీ పరీక్షలకు శిక్షణ అందించే ఉద్దేశంతో దశాబ్దం క్రితం ఏర్పాటైనదే ప్రి ఎగ్జామినేషన్ ట్రైనింగ్ సెంటర్. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తోంది. ఇప్పటివరకు పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై, గ్రూప్స్, అటవీ శాఖ, రెవెన్యూ వంటి నోటిఫికేషన్లకు అనుగుణంగా 3 వేల మందికి తర్ఫీదునిచ్చారు. దాదాపు 100 మంది వివిధ ఉద్యోగాలు సాధించారు. మిగతా ఐటీడీఏలతో పోల్చితే ఇక్కడి కేంద్రం బాగానే పనిచేస్తుందన్న వాదనలు ఉన్నప్పటికీ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రభ కోల్పోయే ఆస్కారం ఉందన్న ఆందోళన నెలకొంది. తాజాగా 'గ్రూప్-4 శిక్షణ బాధ్యత' విషయంలో తీసుకున్న నిర్ణయం ఇందుకు బలం చేకూరుస్తోంది.

ఐటీడీఏ పరిధిలో గిరిజన యువతకు శిక్షణలను పీఈటీసీ, భవిత నిర్వహిస్తుంటాయి. ఈ రెండు వ్యవస్థలపై పీవో, ఏపీవో జనరల్ పర్యవేక్షణ ఉంటుంది. డీడీ పరిధిలోని పీఈటీసీలో పది మంది విధులు పనిచేస్తున్నారు. గిరిజన విద్యాశాఖ పరిధిలోని వీరంతా రెగ్యులర్ ఉద్యోగులే. భర్తీ కాని పోస్టులను పూర్తి అదనపు బాధ్యతలతోను, డిప్యుటేషన్లతో కొనసాగిస్తున్నారు. నిధులను పారదర్శకంగా వెచ్చించి పోటీ పరీక్షార్థులకు నిపుణులతో ఉచిత బోధన అందించటంతోపాటు, భోజనం, వసతి, స్టడీ మెటీరియల్‌ను సమకూర్చటం పీఈటీసీ విధి. తేడా వస్తే ప్రభుత్వ సిబ్బంది కావడంతో కఠిన చర్యలు తీసుకోవచ్చు.




ప్రభుత్వ సంబంధమైన నోటిఫికేషన్లు విడుదలైనప్పుడు ఈ కేంద్రమే శిక్షణ బాధ్యతలు చేపడుతుంది. ఇందుకు భిన్నంగా తాజాగా గ్రూప్-4 శిక్షణ బాధ్యతను వైటీసీకి అప్పగించారు.

అధికారులు ఏమంటున్నారంటే..

పీవో గౌతమ్ ఆదేశాలతో భవితకు గ్రూప్-4 ఎంపిక శిక్షణ బాధ్యతలు అప్పగించామని ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. ప్రి ఎగ్జామినేషన్ ట్రైనింగ్ కేంద్రంలోని ఉద్యోగులకు ఇతర బాధ్యతలు ఉండడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇదే విషయమై డీడీ రమాదేవి, పీఈటీసీ ప్రిన్సిపల్ రమణయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు భవిత నుంచి శిక్షణ అమలవుతోందని అన్నారు.

రూ.50 లక్షలతో..ఐటీడీఏలో మరో కీలక విభాగం భవిత (వైటీసీ). ఇందులో రెగ్యులర్ ఉద్యోగులకు బాధ్యతలు తక్కువ. ఇది జిల్లా జాబ్స్ మేనేజర్ పర్యవేక్షణలో ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వైటీసీలో శిక్షణ ఇస్తుంటారు. ప్రధానంగా ప్రయివేటు రంగంలో ఉపాధి పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను ఇక్కడ నేర్పిస్తారు. ప్రభుత్వ నోటిఫికేషన్లకు సంబంధించిన అడపాదడపా శిక్షణ ఇస్తుంటారు. పీఈటీసీకి పనిఒత్తిడి ఉన్న నేపథ్యంలోనే వీరికి ఈ బాధ్యత అప్పగిస్తారు. తాజాగా పని ఒత్తిడి లేకున్నా భవితకు గ్రూప్-4 శిక్షణ బాధ్యతలు అప్పగించారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ నెల 1న ప్రారంభమైన శిక్షణ 60 రోజులు ఉంటుంది. ఇందుకు రూ.50 లక్షలకు పైగా వెచ్చిస్తారు.

# పల్లె ముంగిట.. ప్రభుత్వ వైద్య సేవలు!

డోర్నకల్ : రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను చేరువ చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామాల్లో గల ఉపకేంద్రాల్లోని ఖాళీలను భర్తీ చేసింది. 139 ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలను ఉన్నతీకరించింది. ఇటీవల చేపట్టిన వైద్యుల నియామకంతో పల్లె దవాఖానాల ద్వారా ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అయ్యాయి. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 70 మంది వైద్యులు బాధ్యతలు చేపట్టి పల్లె దవాఖానాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దంతాలపల్లి, నర్సింహులపేట ఉమ్మడి మండలాల పరిధిలోని పీహెచ్‌సీలో ఇద్దరు, గున్నేపల్లి, దాట్ల, పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల, వంతడపల, పెద్దనాగారం, ముంగిమడుగు పల్లె దవాఖానాల్లో వైద్యులు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఒప్పంద ప్రాతిపదికను పని చేసిన వైద్యులు ప్రస్తుతం శాశ్వతస్థాయిలో అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. దంతాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు వివిధ పల్లె దవాఖానాల్లో బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారులను పలకరించగా వారు 'న్యూస్‌టుడే'తో తమ మనోగతాలను ఇలా పంచుకున్నారు.

ఉత్తమ ఆసుపత్రిగా గుర్తింపు తెస్తా

- బి.స్పందన, నకిరేకల్

మాది నల్గొండ జిల్లా నకిరేకల్. ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఏడాదికాలం ఒప్పంద ప్రాతిపదికన మెట్‌పల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తించాను. ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో శాశ్వత అధికారిగా దంతాలపల్లి పీహెచ్‌సీకి ఆసుపత్రి వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించాను. ఆసుపత్రి పరిధిలోని దంతాలపల్లి, నర్సింహులపేట ఉమ్మడి మండలాల ప్రజలకు సత్వర ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తాను. ఉత్తమ ఆసుపత్రిగా పేరు తీసుకొస్తాను.

సొంతూరిలోనే బాధ్యతలు- చైతన్య, దంతాలపల్లి

మాది దంతాలపల్లి గ్రామం. నేను పుట్టి పెరిగిన ఊరు. ఆదిలాబాద్‌లోని రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఒప్పంద విధానంలో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని ద్వారక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేశాను. ఇటీవల రెగ్యులర్ వైద్యాధికారిగా ఎంపికయ్యాను. పుట్టి పెరిగిన గ్రామంలోనే తాజాగా ప్రభుత్వ వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువ చేస్తా.


అదనపు సమయం కేటాయిస్తా- చందు, పెద్దముప్పారం, దంతాలపల్లి మండలం

మాది దంతాలపల్లి మండలం పెద్దముప్పారం. బీఏఎంఎస్ పూర్తి చేశాను. హనుమకొండ, హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేశాను. నూతన నియామకాల్లో దంతాలపల్లి పీహెచ్‌సీ పరిధిలోని వంతడపల పల్లె దవాఖానా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించాను. ప్రజలకు వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పని చేస్తాను. ప్రసవాల సంఖ్య పెంచుతూ ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు అందిస్తాను.

మెరుగైన సేవలు అందిస్తా అనూష, వరంగల్

బీఏఎంఎస్ పూర్తి చేశాక వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేశాను. ఇటీవల భర్తీ చేసిన వైద్యాధికారుల నియామకాల్లో గున్నేపల్లిలోని ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టాను. గ్రామీణ ప్రాంత ప్రజల ఇబ్బందులపై అవగాహన కలిగి ఉంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం.

# 'మహాదేవ్' పేరునూ వదిలిపెట్టలేదు..! కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ధ్వజం



రాయ్‌పుర్: అవినీతి సొమ్ముతో తన ఖజానాను నింపుకోవడానికే కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దుర్గ్‌లో నిర్వహించిన బహిరంగ సభను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం 'మహాదేవ్' పేరును కూడా వదిలిపెట్టలేదని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాజకీయాల్లో మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసు చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తన దృష్టిలో దేశంలో అతిపెద్ద సామాజిక వర్గం అంటే 'పేదరికమే' అని, తాను వారి సేవకుడినని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పేదలను విభజించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు కొత్త కుట్రలు పన్నుతున్నాయని, కులతత్వ విషాన్ని వ్యాపింపజేస్తున్నాయని ఆరోపించారు. ఓబీసీ ప్రధాన మంత్రిని, మొత్తం వర్గాన్నే కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని, అయితే.. వీటికి తాను భయపడనని అన్నారు. పేదల అభివృద్ధిని కాంగ్రెస్ కోరుకోవడం లేదని విమర్శించారు. 80 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ పథకాన్ని వచ్చే ఐదేళ్లపాటు పొడిగిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఛత్తీస్‌గఢ్‌లో మహాదేవ్ బెట్టింగ్ యాప్ అంశం తీవ్ర కలకలం రేపుతోంది. దాని నిర్వాహకులు.. ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్‌కు రూ.508 కోట్లు చెల్లించినట్లు ఈడీ ఆరోపించింది. ఇదే వ్యవహారంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. దుబాయ్‌లో జరిగిన ఈ కుంభకోణం నిందితులతో తమకేంటి సంబంధం అనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలో పెద్దఎత్తున డబ్బు పట్టుబడిన తర్వాత ముఖ్యమంత్రి ఎందుకు కలత చెందుతున్నారని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దఫాల్లో జరగనున్నాయి. తొలి విడతలో 20 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 7న, రెండో విడతలో మిగతా 70 స్థానాలకు నవంబర్ 17న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భాజపా సహా ఆయా పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.




## జగన్ పాలనలో గాలిలో దీపంలా ప్రజారోగ్యం: లోకేశ్

అమరావతి: నాలుగున్నరేళ్ల సీఎం జగన్ అసమర్థ పాలన రాష్ట్ర ప్రజలకు శాపమైందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారిందని దుయ్యబట్టారు. నాగార్జున సాగర్ సమీపంలోని విజయపురి సౌత్ కమ్యూనిటీ ఆస్పత్రి ప్రాంగణంలో చెట్ల కింద రోగుల దుస్థితి.. జగన్ చేతగాని పాలనకు అద్దం పడుతోందన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో గిరిజన తండాల ప్రజలకు ఏకైక దిక్కుగా ఉన్న ఈ ధర్మాస్పత్రిలో మూడేళ్లుగా చెట్లకిందే వైద్యసేవలు అందిస్తున్నారంటే ముఖ్యమంత్రి సిగ్గుతో తలదించుకోవాలంటూ మండిపడ్డారు.

**చెట్టు కింద వైద్యం :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే.. అల్లూరి జిల్లా లాంటి మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు ఇక ఆ దేవుడేదిక్కన్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో ఆక్సిజన్ సరఫరా వైఫల్యం కారణంగా కళ్లెదుటే.. వేలాదిమంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం కళ్లారా చూశామని గుర్తుచేశారు.

జగన్ దివాలా కోరు పాలన పుణ్యమా అని కర్నూలు, అనంతపురం వంటి బోధనాస్పత్రుల్లోనే దూది సైతం అందుబాటులో లేని దుస్థితి నెలకొందని విమర్శించారు. రాష్ట్రంలో ఇంత దారుణమైన పరిస్థితులు కళ్లెదుట కన్పిస్తుంటే.. తమ హయాంలో వైద్య, ఆరోగ్య రంగం వెలిగిపోతుందని, జగనన్న సురక్ష పేరుతో ఇళ్లవద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రిని పిచ్చోడుగాక మరేమనాలని లోకేశ్ దుయ్యబట్టారు.

# జర్నలిస్టులకు బాబు చేయలేనిది జగన్ చేస్తున్నారా...?



అమరావతి: ఉమ్మడి ఏపీ తీసుకున్నా లేక విభజన ఏపీ అయినా జర్నలిస్టులకు మేలు జరిగినది మాత్రం కాంగ్రెస్ హయాంలోనే అని అంతా అంటారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వాలే జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చారు చివరి సారిగా వైఎస్సార్ ఉమ్మడి ఏపీకి ముఖ్యమంత్రిగా ఉండగా 2005లో పెద్ద ఎత్తున నాటి ఇరవై మూడు జిల్లాల జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలను అందించి ఎనలేని మేలు చేశారు. ఆ తరువాత ఎన్నో ప్రభుత్వాలు మారినా కూడా ఏమీ మేలు జరగలేదు. ఇక చూస్తే విభజన ఏపీలో 2014లో చంద్రబాబు సీఎం అయ్యారు. ఆయన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెప్పారు. అది కూడా 2018లో చివరిలో కార్యాచరణ మొదలెట్టామని అన్నారు. తీరా జర్నలిస్టులు అంతా ఆశపడి ఆన్ లైన్ లో దరఖాస్తులు పూర్తి చేశారు. కానీ ఈలోగా కొంత ఆలస్యం అయింది ఎన్నికల కోడ్ అమలులోని వచ్చింది. ఆ విధంగా జర్నలిస్టులు తీరని నిరాశకు లోను అయ్యారు. ఇక పాదయాత్రలో జగన్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇస్తాను అని హామీ ఇచ్చారు. జగన్ సైతం అయిదేళ్ల తరువాత చివరలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. అది కూడా వైఎస్సార్ ఎక్కడ అపేశారో 2006 నుంచి 2023 దాకా ఉన్న పాత్రికేయులు అందరికీ సొంత ఇంటి కలను నెరవేర్చబోతున్నారు. అయితే జగన్ ప్రభుత్వం చాలా తొందరగా ఇళ్ళ స్థలాలను పాత్రికేయులకు అందించేందుకు రంగం సిద్ధం చేయాలని అంతా కోరుకుంటున్నారు. ఎందుకంటే ఏపీలో ఎన్నికలకు కేవలం నాలుగు నెలలు మాత్రమే సమయం ఉంది. దాంతో జర్నలిస్తుల దశాబ్దాల్ కల నెరవేరాలీ అంటే కనుక కచ్చితంగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికగానే చేయాల్సింది చేయాల్సి ఉంది. మరో వైపు చూస్తే ఏపీలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఒక సెక్షన్ ఆఫ్ మీడియాతో యుద్ధమే సాగుతోంది. ప్రభుత్వ పెద్దలు సైతం బాహాటంగానే ఫలనా మీడియా యజమానులు టీడీపీ అనుకూల వర్గాలు అని చెబుతూ వస్తున్నారు. ఇలా అటూ ఇటూ రాజకీయాలు చేరిపోయి ఏపీలో జర్నలిజానికి ఇబ్బంది కలిగిస్తున్నాయి. సగటు జర్నలిస్టు కూడా ఆయా పార్టీలకు అనుకూలురు అన్నట్లుగానే ప్రత్యర్ధి పార్టీలు భావించే పరిస్థితి ఉంది. ఇంత జరుగుతున్న వేళ జర్నలిస్టు ఏ పత్రికలో చేసినా అతనికి రాజకీయ రంగు అంటదని అతను చేసేది భుక్తి కోసమని భావించి ఏ తేడాను గుర్తించి వైసీపీ ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు ఇవ్వడానికి ముందుకు రావడం హర్షించతగిన పరిణామం అని అంటున్నారు. మరి ఎన్నికల వేళ వేలాది జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం న్యాయం చేస్తే దాని ఫలితాలు వైసీపీకి ఎంతమేరకు అందుతాయన్నది కూడా చర్చగా ఉంది. ఏది ఏమైనా మునుపటి వ్యతిరేకతతో అయితే సగటు పాత్రికేయుడు రాయలేడు అనుకోవాలి. కానీ మీడియా యాజమాన్యాలు అజెండానే ఎవరైనా అమలు చేయాలని అనుకున్నపుడు వృత్తి వృత్తే బతుకు బతుకే అన్నట్లుగా ఉంటుంది. మరి ఇవన్నీ గ్రహించుకునే వైసీపీ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి సిద్ధపడుతోంది అని అంటున్నారు. ఏదేమైనా సమాజంలో వారధులుగా ఉండే జర్నలిస్టుల పట్ల సాఫ్ట్ కార్నర్ గా ఉండడం ఏ ప్రభుత్వానికి అయినా మంచే చేస్తుంది అని అంటున్నారు.

## ఏడాదికి ఒక్కసారే శ్రీవారిని దర్శించుకుంటా...



తిరుమల: ఏడాదికి ఒక్కసారి మాత్రమే కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకోవాలని నిర్ణయం తీసుకున్నానని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. శనివారం కుటుంబసభ్యులతో స్వామివారిని దర్శించుకున్న వెంకయ్య ఆపై మీడియాతో మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించడం ఎంతో తృప్తిని కలిగించిందన్నారు. దేశం అన్ని విధాల అభివృద్ధి చెందాలని.. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించానని తెలిపారు. శ్రీవారి సన్నిధిలో ఎవరు కూడా రాజకీయాల ప్రస్తావన తీసుకురాకూడదని తెలిపారు. ఉపరాష్ట్రపతిగా పదవి విరమణ పొందిన తర్వాత ఎక్కడ కూడా రాజకీయాలు మాట్లాడకూడదని తాను నిర్ణయం తీసుకున్నట్లు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

## టీటీడీ ఈవో ధర్మారెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం



తిరుమల: ధైర్యం ఉంటే పార్వేట మండపం వద్దకు వచ్చి నిర్మాణం బాగా లేదని చెప్పగలరా అంటూ టీటీడీ ఈవో ధర్మారెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తేదీ.. సమయం చెబితే.. అర్కాలజీ అధికారులతో కలిసి పార్వేటి మండపం పరిశీలనకు వస్తానన్నారు. మరమ్మతుల పేరుతో ప్రాచీన కట్టడాలను టీటీడీ కూలతోయ్యకూడదని హితవుపలికారు. టీటీడీ చేస్తున్న అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదన్నారు. పురాతన మండపాలను జీర్ణోద్ధారణ చేసే సమయంలో టీటీడీ అర్కాలజీ అధికారులను సంప్రదించాలన్నారు. ఆర్కాలజీ అధికారుల సూచనలు మేరకు టీటీడీ జీర్ణోద్ధారణ పనులు చేయాలని భానుప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు.




దిల్లీ: వైకాపా ఎంపీ విజయసాయి రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి భాజపా ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి లేఖ రాశారు. పదేళ్లుగా బెయిల్‌పై కొనసాగుతూ సీబీఐ, ఈడీ కేసుల విషయంలో విజయసాయి షరతులు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. ఆయనపై ఇప్పటికే 11 అభియోగాలు, పలు సెక్షన్ల కింద కేసులు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు లేఖతో పాటు ఐదు దస్త్రాలు, విజయసాయి కేసు వివరాలు, భూకుంభకోణాలపై ప్రత్యేక కథనాలను పురందేశ్వరి జతచేశారు.

**పదే పదే వాయిదాలతో విచారణకు రాకుండా..** అధికారంలో ఉన్న సీఎం జగన్, ఎంపీ విజయసాయి రెడ్డి వంటి వ్యక్తులు 10 ఏళ్లకుపైగా బెయిల్‌పై కొనసాగుతున్నారని తన లేఖలో పురందేశ్వరి పేర్కొన్నారు. వీరు ప్రతి కేసులోనూ విచారణ జరగకుండా ఆలస్యం చేస్తూ నిరోధిస్తున్నారని ఆరోపించారు. పదే పదే వాయిదాలతో విచారణకు రాకుండా ఉంటున్నారని పేర్కొన్నారు. విజయసాయి తన బినామీలతో రాష్ట్రంలో కొన్ని డిస్టిలరీలను నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో బయటపడిందని, ఈ అంశం వెలుగులోకి రాగానే మద్యం కుంభకోణంపై దర్యాప్తు చేయాలని కేంద్ర హోంమంత్రికి లేఖలు రాసినట్లు తెలిపారు.

**నాపై బెదిరింపులు :** వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి 2 ఏళ్లలో చాలా మందిని విజయసాయి బెదిరించి వారి ఆస్తులను కబ్జా చేయించారని ఆరోపించారు. కుటుంబసభ్యుల కంపెనీల కోసం బెదిరించి భూములు కొన్నారన్నారు. వాస్తవానికి విశాఖ దసపల్లా భూముల విషయంలో బెదిరించి, అభివృద్ధి ప్రాతిపదికన భూయజమానులకు నామమాత్రపు వాటాతో స్వాధీనం చేసుకోవడంలో కూడా ఆయన సూత్రధారిగా ఉన్నట్లు తెలిపారు. వీటిలో కొన్నింటిని తాను ప్రస్తావించినప్పుడు ఎంపీ విజయసాయి బహిరంగంగా విలేఖరుల సమావేశంలో తనను బెదిరించారని పురందేశ్వరి ఆరోపించారు. ఇలాంటి అంశాలపై భవిష్యత్తులో మాట్లాడితే, ప్రజల మధ్య బయట తిరగకుండా చేస్తానని వ్యక్తిగత దూషణలు చేశారన్నారు.

**బెయిల్ రద్దు చేయాలి :** మాజీ మంత్రి వివేకాను గొడ్డలితో నరికి హత్య చేసినవేళ.. ప్రెస్‌మీట్ పెట్టి అది కేవలం గుండెపోటు, సహజ మరణమని చెప్పిన మొదటి వ్యక్తి విజయసాయి అనే అంశం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఇలాంటి వారి వల్ల మన వ్యవస్థలపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారని పురందేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. తన లేఖను పరిశీలించి ప్రస్తావించిన అంశాల్లో జోక్యం చేసుకొని విజయసాయి బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. వచ్చే 6 నెలల్లో ఈ కేసులన్నింటినీ ఒక కొలిక్కి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సీజేఐకి పురందేశ్వరి విజ్ఞప్తి చేశారు.




## బెట్టింగ్ యాప్ నుంచే కాంగ్రెస్ ప్రచారానికి నిధులు: స్మృతి ఇరానీ

దిల్లీ: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల వేళ మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన విషయం వెల్లడించింది. బెట్టింగ్ యాప్ ప్రమోటర్ల నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కు రూ.508 కోట్లు చెల్లింపులు జరిగినట్లు గుర్తించింది. దీంతో ఈ అంశం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో సీఎం బఘేల్‌పై కేంద్రమంత్రి స్మృతి ఇరానీ విమర్శలు గుప్పించారు. బెట్టింగ్ యాప్ ప్రమోటర్ల సాయంతోనే కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల్లో పోరాడుతోందని స్మృతి ఇరానీ ఆరోపించారు. "కాంగ్రెస్ ప్రచారం కోసం నిధులు సమకూర్చేందుకు హవాలా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సీఎం ప్రచారానికి బెట్టింగ్‌ల ద్వారా వచ్చిన అక్రమ డబ్బును వినియోగించడం ఆందోళన చెందాల్సిన విషయం. ఎన్నికల చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు. అధికారంలో ఉండగా ఆయన బెట్టింగ్ గేమ్ ఆడారు" అని అన్నారు. యూఏఈ నుంచి వచ్చిన అసిన్ అనే క్యాష్ కొరియర్ నుంచి రూ.5.39 కోట్ల నగదును స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసినట్లు ఈడీ తెలిపింది. ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు ప్రచారం కోసం భారీ మొత్తంలో నగదును అందించేందుకే మహాదేవ్ బెట్టింగ్ యాప్ నిర్వాహకులు ఈ వ్యక్తిని పంపినట్లు ఈడీ అధికారులు ఆరోపిస్తున్నారు. అసిన్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణ జరిపింది. యాప్ నిర్వాహకుల నుంచి ఇప్పటి వరకు రూ.508 కోట్లు సీఎంకు అందినట్లు వెల్లడించింది. ఆ డబ్బును 'బఘేల్' అనే రాజకీయ నేతకు అందించాల్సి ఉందని ఆ కొరియర్ ఒప్పుకొన్నట్లు ఈడీ పేర్కొంది. ఇదిలా ఉండగా.. ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌పై వస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. భాజపా ప్రజల ముందు సీఎం ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఓటమి ఖాయమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అందుకే కేంద్రం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు.




కాఠ్‌మాండూ: నేపాల్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. అర్ధరాత్రి భారీ భూకంపం సంభవించింది. వాయువ్య నేపాల్‌లోని మారుమూల పర్వత ప్రాంతాల్లో సంభవించిన ఈ భూకంప విపత్తులో ఇప్పటివరకు 132 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మరో 140 మంది వరకు గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

**6.4 తీవ్రతతో భూకంపం :** శుక్రవారం రాత్రి 11.47 గంటల ప్రాంతంలో ఈ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.4గా నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. భూకంప కేంద్రం 11 మైళ్ల లోతులో ఉన్నట్లు గుర్తించింది. జజర్‌కోట్‌లో భూకంప కేంద్రం గుర్తించినట్లు నేపాల్ జాతీయ భూకంప పర్యవేక్షణ, పరిశోధన కేంద్రం తెలిపింది. భూకంప తీవ్రతకు పలు జిల్లాలో ఇళ్లు నేలమట్టం అయ్యాయి. రుకమ్ జిల్లాలో ఇళ్లు కూలి సుమారు 35 మంది, జజర్‌కోట్‌లో 34 మంది మృతి చెందినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. రాత్రి సమయం కావడంతో సహాయ చర్యలు కష్టంగా మారాయని, కొన్ని చోట్లు కొండచరియలు విరిగిపడి వెళ్లలేకపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. అటు రాజధాని కాఠ్‌మాండూలోనూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఈ భారీ భూకంపం తర్వాత శనివారం తెల్లవారుజామున 4 సార్లు మళ్లీ ప్రకంపనలు సంభవించాయి. మృతుల కుటుంబాలకు నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహాల్ ప్రచండ సంతాపం ప్రకటించారు. నేపాల్‌లో 2015లో 7.8 తీవ్రతతో వచ్చిన భూకంపం 9వేల మందిని బలితీసుకున్న విషయం తెలిసిందే.

**మృతుల్లో.. స్థానిక సంస్థ డిప్యూటీ హెడ్ :** ఈ ప్రకృతి విపత్తులో జజర్‌కోట్ జిల్లాలోని నల్‌గఢ్ మున్సిపాలిటీ డిప్యూటీ హెడ్ సరితా సింగ్ మృతిచెందారు. భూకంప ధాటికి ఆమె ఉంటున్న నివాసం కూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు.

**దిల్లీని తాకిన భూ ప్రకంపనలు :** మరోవైపు, ఈ భూకంప తీవ్రతకు భారత్‌లోని పలు ప్రాంతాలు కంపించాయి. 800 కి.మీ దూరంలో ఉన్న దేశ రాజధాని దిల్లీతో పాటు యూపీ, బిహార్‌లోని పలు ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఏం జరుగుతుందో తెలియక రోడ్లపై పరుగులు పెట్టారు. దీనికి సంబంధించి పలువురు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు.

## చంద్రబాబును పరామర్శించిన పవన్ కల్యాణ్




హైదరాబాద్: తెదేపా అధినేత చంద్రబాబును జనసేన అధినేత పవన్ కల్యాణ్ పరామర్శించారు. శనివారం సాయంత్రం నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్టోబరు 31న రాజమహేంద్రవరం జైలు నుంచి విడుదలైన చంద్రబాబు వైద్య పరీక్షల కోసం ఇటీవల హైదరాబాద్ వచ్చారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో వైద్యులు అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు గుండె, ఊపిరితిత్తులు, చర్మ అలర్జీకి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. రెండ్రోజుల్లో చంద్రబాబు ఎల్వీపీఈఐలో నేత్ర పరీక్షలతో పాటు సర్జరీ చేయించుకుంటారని సమాచారం.

# హబీబీ జిలేబీ.. హుషారెత్తించేలా రోషన్ బబుల్ గమ్ సాంగ్

యాంకర్ సుమ కనకాల తనయుడు రోషన్ హీరోగా వెండితెరకు పరిచయం కానున్న చిత్రం బబుల్ గమ్. రీసెంట్‌గా ఈ చిత్ర టీజర్ విడుదలై ఆకట్టుకుంది. ఇప్పుడు సినిమా నుంచి ఓ సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. బస్సీలో హీరోహీరోయిన్‌పై చిత్రీకరించిన ఈ పాట హుషారెత్తించేలా మంచి బీట్‌తో సాగింది. వివరాళ్లోకి వెళితే.. న్యూ ఏజ్ లవ్ స్టోరీతో రానున్న చిత్రం బబుల్ గమ్. ఓ రిచ్ గర్ల్ అండ్ పూర్ బాయ్ మధ్య సాగే లవ్ స్టోరీని కొత్తగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు మేకర్స్. ఇప్పటికే విడుదలైన టీజర్‌లో రోషన్ కనకాల తన స్టైల్ అండ్ స్వాగ్‌తో ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా తెలంగాణ స్లాంగ్‌లో అతడి డైలాగ్స్, హీరోయిన్‌తో రొమాన్స్, ఘాటైన లిప్ కిస్‌లు




హైలైట్‌గా నిలిచాయి. యూత్‌కు బాగానే కనెక్ట్ అయిందీ ప్రచార చిత్రం. క్షణం, కృష్ణ అండ్ హిస్ లీలా వంటి సూపర్ హిట్ సినిమాలను తెరకెక్కించిన రవికాంత్ పేరేపు ఈ బబుల్ గమ్ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. రోషన్ కనకాల సరసన మనసా చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. శ్రీ చరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని ఆడియెన్స్ ముందుకు తీసుకువస్తోంది. సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి చిత్రాన్ని సినీ ప్రముఖుల చేత బాగానే ప్రమోట్ చేయిస్తున్నారు. అలా ఈ క్రమంలోనే తాజాగా మంచి బీట్ ఉన్న హబీబీ యూ ఆర్ మై జిలేబీ అంటూ సాగే సాంగ్‌ను రిలీజ్ చేశారు.

ఈ పాటకు శ్యామ్ అందించిన లిరిక్స్‌కు, శ్రీ చరణ్ పాకాల అందించిన మ్యూజిక్ హైలైట్‌గా ఉంది. శ్రోతలను హుషారెత్తించేలా ఉంది. సాంగ్ లిరిక్స్, బీట్‌కు తగ్గట్టు రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన తీరు, హీరోయిన్‌తో కలిసి రోషన్ వేసిన డ్యాన్స్ స్టెప్పులు ఆకట్టుకునేలా ఉన్నాయి. అతడి డ్రెస్సింగ్ స్టైల్ కూడా బాగుంది. గల్లీలో ఎంటర్ అయిన రిచ్ పిల్లను చూసి లవ్‌లో పడిపోయిన హీరో.. హీరోయిన్ వల్ల తన లైఫ్ ఎలా మారింది, తనకు కలిగిన ఫీలింగ్స్‌న్సను ఎక్స్‌ప్రెస్ చేసేలా సాగిందీ సాంగ్. పొలాకి విజయ్ కొరియోగ్రఫీ చేశారు. రోషన్ స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది.

## మెల్లి మెల్లిగా మహానటి బాలీవుడ్‌కి జంప్!

మహానటి కీర్తి సురేష్ మెల్లి మెల్లిగా బాలీవుడ్ కి జంప్ అవుతోందా? అంటే అవుననే గుసగుసలు వినిపిస్తున్నాయి. సమంత .. నయనతార లాంటి స్టార్ హీరోయిన్లకు ఇటీవల బాలీవుడ్ లో అవకాశాలు పెరిగాయి. ఫ్యామిలీమ్యాన్ ఫ్రాంఛైజీతో నిరూపించి, సిటాడెల్ సిరీస్ తో సమంత హిందీ పరిశ్రమలో మరోసారి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. అలాగే జవాన్ తో నయన్ ఆశించినది సాధించింది. ఆ ఇద్దరికీ ఆఫర్ల వెల్లువ అమాంతం పెరిగిందని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇంతకుముందు రాశీఖన్నా సైతం రాజ్ అండ్ డీకే ఫర్జీతో బాలీవుడ్ లో హాట్ టాపిక్ అయింది. పుష్ప తర్వాత రష్మిక మందన్న అద్భుత అవకాశాలు అందుకుంటోంది. ఇప్పుడు అదే కేటగిరీలో మరో సౌత్ నటి చేరబోతోందంటూ ప్రచారం సాగుతోంది. అందాల కీర్తి సురేష్ కూడా హిందీ చిత్రసీమలో రాణించి



పాన్ ఇండియా స్టార్ గా వెలగాలని కలలు గంటోంది. కీర్తి ఇప్పటికే బాలీవుడ్ లో నటించాలని కలలు కంది. కానీ ఆ కల ఇన్నాళ్లు నెరవేరేలేదు. ఇప్పటికి నెరవేరబోతోంది. ఇటీవలే కీర్తిని బాలీవుడ్ లో క్రేజీ ఆఫర్ వరించింది. యువహీరో వరుణ్ ధావన్ సరసన ఈ భామకు అవకాశం దక్కింది. జవాన్ తో బంపర్ హిట్ కొట్టిన అట్లీ ఈ చిత్రానికి దర్శకుడు కావడం ప్రధాన అస్సెట్ కానుంది. నిజానికి అట్లీ నయనతారకు అద్భుతమైన అవకాశాన్నిచ్చారు. జవాన్ తో నయన్ పాన్ ఇండియా స్టార్ డమ్ ని అందుకుంది. తర్వాత కీర్తి సురేష్‌కి అట్లీ ఆఫర్ ఇవ్వడం అంటే రొట్టె విరిగి నెయ్యిలో పడిన చందమేనని కూడా అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. కీర్తికి నిజానికి సౌత్ లో ఆశించినంతగా పెద్ద ఆఫర్లు లేవు.. కానీ ఇప్పుడు బాలీవుడ్ కి వెళు తోంది. అక్కడ ఆశించిన బిగ్ హిట్ సాధిస్తే ఒక యామీ గౌతమ్ లా ఆఫర్లు అందుకుంటుందనే అంతా భావిస్తున్నారు.

ఫ్యామిలీమేన్ ఫ్రాంఛైజీతో సమంత ఎదురేలేని నటిగా హిందీ ప్రేక్షకుల్లో అభిమానం చూరగొంది. జవాన్ లో యాక్షన్ క్వీన్‌గా మెరిపించిన నయనతారకు ఇప్పుడు హిందీ బెల్ట్ లో భారీ ఫాలోయింగ్ ఏర్పడింది. అదే తీరుగా ఇప్పుడు కీర్తి కూడా నిరూపించాలని భావిస్తోంది. సిటాడెల్‌లో వరుణ్ ధావన్ - సమంత రూత్ ప్రభుల జోడి హిందీ పరిశ్రమలో విపరీతమైన ఉత్సాహాన్ని సృష్టించింది. సమంత సౌత్ ఇండియన్ గ్రేస్ .. వరుణ్ ధావన్ బాలీవుడ్ ఆకర్షణతో సిటాడెల్ సినిమాటిక్ బ్యూటీగా మారుతుందని భావిస్తున్నారు.




# సీత వెంట నాన్న రొమాంటిక్ వాక్




నేచురల్ స్టార్ నాని హీరోగా ప్రస్తుతం రూపొందుతున్న చిత్రం 'హాయ్ నాన్న'. ఈ సినిమా లో నాని తండ్రి పాత్రలో కనిపించబోతున్నట్లుగా టైటిల్ ను చూస్తూ ఉంటే అర్థం అవుతుంది. పదేళ్ల పాప తండ్రిగా కనిపిస్తూ కూడా రొమాంటిక్ అండ్ లవ్ సీన్స్ లో నాని ని ఈ చిత్రం లో చూడబోతున్నామని తాజా పోస్టర్స్ ను చూస్తూ ఉంటే అర్థం అవుతోందని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటి వరకు పాప తో ఉన్న పోస్టర్ లను ఎక్కువగా విడుదల చేయడం జరిగింది. కానీ ఈసారి నా ని మరియు మృణాల్ ఠాకూర్ ఉన్న పోస్టర్ ను మాత్రమే రిలీజ్ చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పెద్ద ఎత్తున వైరల్ అవుతున్న ఈ ఫోటో తో ఈ సినిమాలో మంచి లవ్ సీన్స్ కూడా ఉండబోతున్నా యి అనిపిస్తోంది. సీతారామం సినిమా లో సీత పాత్రలో నటించి మెప్పించిన మృణాల్ ఈ సినిమాలో కూడా కాస్త అదే తరహా లు క్ లో కనిపిస్తోంది. అందుకే సీత వెనుక పడ్డ నాన్న నాని అంటూ నెటిజన్స్ కొందరు ఈ పోస్టర్ కి కామెంట్స్ చేస్తూ షేర్ చేస్తూ వైరల్ చేస్తున్నారు. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా ఈ సినిమా ఉంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ఇప్పటికే విడుదల అయిన హాయ్ నాన్న గ్లిమ్స్ మరియు పాటలు సినిమా పై అంచనాలు పెంచాయి. తాజాగా ఈ పోస్టర్ తో సినిమా గు రించి ఇప్పటి వరకు ఉన్న చిన్న చిన్న అనుమానాలు కూడా తొలగి పోయినట్లు అయిందని నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# గుంటూరు కారం.. అంత మాట అనేశారేంటి?



సంక్రాంతి పోటీపై చాలా రోజులుగా నిర్మాతలకు దర్శకులకు అలాగే నటీనటులకు పలు రకాల ప్రశ్నలు ఎదురవుతూనే ఉన్నాయి. ఎలాంటి ప్రెస్ మీట్ జరిగిన కూడా సంక్రాంతి పోటీలో వారి సినిమా ఉంటే అనేక రకాల సందేహాలు అయితే వారి ముందు పెడుతున్నారు. ఆ ప్రశ్నలకు ఎవరికి తోచినట్టుగా వారు సమాధానాలు అయితే ఇస్తున్నారు. కానీ రీసెంట్ గా గుంటూరు కారం నిర్మాతల్లో ఒకరైన నాగవంశీ ఇచ్చిన సమాధానం హాట్ టాపిక్ గా మారిపోయింది. సితార ఎంటర్టైన్మెంట్స్ అధినేత నాగ వంశీ రీసెంట్ గా ఆదికేశవ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ మార్పు విషయంపై ప్రెస్ మీట్ నిర్వహించారు. వరల్డ్ కప్ సెమి ఫైనల్ మ్యాచ్ కారణంగా ఆదికేశవ సినిమా డేట్ లో మార్పులు చేస్తున్నాము అని వివరణ ఇచ్చారు. అయితే ఇదే సమయంలో గుంటూరు కారం సినిమాకు సంబంధించిన ప్రశ్నలు కూడా ఎదురయ్యాయి.

ఆ సినిమా రిలీజ్ డేట్ విషయంలో అయితే ఎలాంటి మార్పులు లేవని అనుకున్న అందుకే వస్తుంది అని క్లారిటీ ఇచ్చారు. అంతే కాకుండా సంక్రాంతికి చాలా సినిమాలు పోటీలో ఉన్నాయి కాబట్టి నిర్మాతలు ఎవరైనా సంప్రదించరా గిల్డ్ తో కలిసి మాట్లాడారా అనే ప్రశ్నలు కూడా వచ్చాయి ఇక ఆ విషయంలో వంశీ చాలా ధీమాగా సమాధానం ఇచ్చారు. సంక్రాంతి సినిమాల్లో ఫస్ట్ ప్రియారిటి అందరికీ గుంటూరు కారం.. ఇక అలాంటి క్రేజ్ ఉన్నప్పుడు వేరే ఎవరైనా వచ్చి నన్ను అడగాలి. కానీ నేను రిలీజ్ విషయంలో ఎవరిని అడుగుతాను.. ఈ సినిమాకి ఎక్కువ స్థాయిలో క్రేజీ ఉంది.. అంటూ అందరూ దీన్నే చూడాలని అనుకుంటున్నారు అన్నట్లుగా నాగ వంశీ వివరణ ఇచ్చాడు. ఆయన కాన్ఫిడెన్స్ గట్టిగానే ఉంది కానీ పోటీలో ఉన్న మిగతా సినిమాలను తక్కువ అంచనా వేయడానికి అసలు వీలు లేదు. ఇలాంటి ప్రశ్నలకు సింపుల్ గా అన్ని సినిమాలు ఆడాలి సంక్రాంతి అన్నప్పుడు ఈ మాత్రం పోటీ ఉంటుంది అన్నట్లు సమాధానం ఇస్తే సరిపోయేది. కానీ తమ సినిమాకి ఎక్కువ స్థాయిలో క్రేజ్ ఉంది అంటూ నాగ వంశీ వివరణ ఇవ్వడంతో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పోటీలో వెంకటేష్ సైంధవ్ సినిమాతో పాటు విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్ కూడా కాస్త బజ్ ఉన్న సినిమాలే. ఇంకా హనుమాన్, రవితేజ ఈగల్, నాగార్జున నా సామి రంగా సినిమాలను కూడా తక్కువ అంచన వేయడానికి వీలు లేదు. మరి నాగవంశీ కాన్ఫిడెన్స్ కు తగ్గట్టుగా రాబోయే అప్డేట్స్ గుంటూరు కారం అప్డేట్స్ పై అంచనాలు పెరుగుతాయో లేదో చూడాలి.

## సఫారీ డిజైన్ లో కపూర్ బ్యూటీ సెగలు!

బాలీవుడ్ లో ఎంత మంది సీనియర్ భామలున్నా కరీనా కపూర్ మాత్రం సంథింగ్ స్పెషల్. 43 ప్లస్ లోనూ 25 బ్యూటీలా సెగలు పెట్టించడం కరీనాకే చెల్లింది. వయసు ముదురుతోన్న కొద్ద అందం అంతకంతకు రెట్టింపు అవుతుందో తప్ప! తరుగుతోన్న సందర్భం ఎక్కడా కనిపించలేదు. ఇప్పటికే కరీనా ఇద్దరు పిల్లలకు తల్లైంది? కానీ బ్యూటీ విషయంలో ఇసుమొత్తు కూడా మార్పు కూడా రాలేదు. అదే ఫిట్ నెస్ మెయింటెన్ చేస్తూ నవనాయికలకు గట్టిపోటీనిస్తుంది. కరీనా మంచి ఫిట్ నెస్ ఫ్రీక్ కావడంతోనే ఇదంతా సాధ్యమైంది. తాజాగా కపూర్ బ్యూటీ స్టైలిష్ లుక్ ఒకటి ఇన్ స్టాలో చక్కెర్లు కొడుతుం ది. అందులో కరీనా షోల్డర్ లెస్ సపారీ తరహా డిజైన్ దుస్తుల్లో కనిపిస్తుంది. అమ్మడు అందంగా ముస్తాబై చైర్ లో కూర్చుని వివిధ భంగిమల్లో కెమెరాకి ఫోజులిచ్చింది. క్యాట్ లుకింగ్ స్టైల్ కి ఎవరైనా పడాల్సిందే అన్నట్లు గా అలా ఓ భంగిమలో ఇచ్చిన



ఫోజు సంథింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. ఇక కరీనా స్టైల్ క్లీవేజ్ ఏమాత్రం తగ్గలేదు. తనదైన మార్క్ ఎలివేషన్ తో ఆకట్టుకుం టుంది. ఇది ఓ రెస్టారెంట్ లో క్యాప్చర్ చేసిన పిక్ . ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. కరీనా సినిమాల సంగతి చూస్తే అమ్మడికి ఉడ్తా పంజాబ్..వీర్ ది వెడ్డింగ్ తర్వాత సరైన సక్సెస్ పడినట్లు కనిపించలేదు. భారీ అంచనాలమధ్య రిలీజ్ అయిన సినిమాలన్నీ డిజాస్టర్ల జాబితాలో చేరుతున్నాయి. ఆ రెండు విజయాల తర్వాత చేసిన నాలుగు సినిమాలు ఒకే రకమైన ఫలితాలు సాధించాయి. ఇటీవల రిలీజ్ అయిన ది బకింగ్ హమ్ మర్డర్స్ కూడా అంచనాలు అందుకోలేదు. ఈ చిత్రానికి నిర్మాతగానూ వ్యహరిం చింది. ప్రస్తుతం దిక్రూ..సింగం ఎగైన్ చిత్రాల్లో నటిస్తోంది.

## పూల చీరలో తేనెలూరే అందాలు

షిఫాన్ చీర కట్టి సందట్లో సడేమియా ఏంటో కానీ.. అలా పూల చీరలో హనీరోజ్ ఎంతో అందంగా కవ్విస్తోంది. అందానికి అందం వేడెక్కించే సొగసు ఉన్న నటిగా హనీ పేరు మార్మోగుతోంది. నటసింహా నందమూరి బాలకృష్ణ సరసన అవకాశం అందుకుంది అంటేనే హనీరోజ్ కి లక్ చిక్కిందని అర్థం. బ్లాక్ బస్టర్ అఖండ తర్వాత ఈ అమ్మడి క్రేజ్ టాలీవుడ్ లో అమాంతం పెరిగింది. ఇక రిబ్బన్ కటింగ్ ఆఫర్లకు అయితే కొదవే లేదు. ఒక్కో ఈవెంట్ కి లక్షల్లో ప్యాకేజీలు అందుకుంటోంది. తాజాగా మరో ఆకర్షణీయమైన ఫోటోషూట్ తో ఈ భామ యువతరంలో హాట్ టాపిక్ గా మారింది. ఈసారి క్రీమ్ కలర్ చీరలో హనీరోజ్ సౌందర్యం మంత్ర ముగ్ధులను చేస్తోంది. ముదురు గులాబీ రంగు బ్లౌజ్ కాంబినేషన్ ఎంతో ఆకట్టుకుంది. ఈ అందమైన చీరకు తగ్గట్టే మ్యాచింగ్ పింక్ చెవిపోగులు ధరించింది. ఆ ముఖంపై చెరిగిపోని అందమైన నవ్వు హనీరోజ్ కి ప్రధాన అస్సెట్ అనడంలో సందేహం లేదు.



**ఈ అందం పయనమిలా సాగింది:** హనీ రోజ్ వర్గీస్ (జననం 5 సెప్టెంబర్ 1991) ప్రముఖ మలయాళ నటి. కొన్ని తమిళ, కన్నడ, తెలుగు చిత్రాలలో కూడా కనిపించింది. 2005 మలయాళ చిత్రం బాయ్ ఫ్రెండ్‌తో తొలిసారిగా తెరకు పరిచయమైంది. 2012లో త్రివేండ్రమ్ లాడ్జ్‌లో సంచలన పాత్రతో ఆకట్టుకుంది. హనీ రోజ్ వర్గీస్ కేరళలోని మూలమట్టంలో సైరో-మలబార్ కాథలిక్ కుటుంబంలో జన్మించారు. మూలమట్టంలోని %హా.ఎ.జు.వీ% ఉన్నత పాఠశాలలో చదువుకుంది. ఆమె సెయింట్ జేవియర్స్ కాలేజ్ ఫర్ ఉమెన్, అలువా నుండి కమ్యూనికేటివ్ ఇంగ్లీష్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని కలిగి ఉంది. 2005లో 14 ఏళ్ల వయస్సులో తన కెరీర్‌ను ప్రారంభించిన హనీ రోజ్ వినయన్ దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం బాయ్ ఫ్రెండ్‌లో నటించింది. ఇందులో మణికుట్టన్ స్నేహితురాలిగా నటించింది. 2007లో తన మొదటి నాన్-మలయాళ ప్రాజెక్ట్ లో నటించింది.మె మొదటి తమిళ చిత్రం రొమాంటిక్ డ్రామా ముథల్ కనవేకి సంతకం చేసింది. ముత్యాల సుబ్బయ్య 50వ చిత్రం ఆలయం (2008)లో నటించింది. నిజానికి ఆలయం హనీరోజ్ కి తెలుగు అరంగేట్ర చిత్రం. చాలా గ్యాప్ తర్వాత బాలకృష్ణ సరసన అఖండ లాంటి భారీ చిత్రంలో అవకాశం అందుకుంది. ఈ సినిమా ఘనవిజయం సాధించడంలో హనీరోజ్ పేరు మార్మోగింది.




నంగునూరు: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి గ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సీఎం కేసీఆర్ దర్శించుకున్నారు. ఆలయంలో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ నామినేషన్ వేయడానికి ముందు ఈ ఆలయాన్ని సందర్శించడం ఆనవాయితీగా వస్తోంది. నామినేషన్ పత్రాలతో ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి విజయాన్ని ప్రసాదించాలని ఆయన వేడుకుంటారు. ఈ ఎన్నికల్లో గజ్వేల్, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగుతున్న కేసీఆర్ తాను దాఖలు చేయనున్న నామినేషన్ పత్రాలకు పూజలు చేశారు. ఉదయం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి రోడ్డుమార్గం ద్వారా గ్రామానికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. నామపత్రాలను స్వామి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. సీఎం కేసీఆర్ ఈ నెల 9న ఉదయం గజ్వేల్‌లో, మధ్యాహ్నం కామారెడ్డిలో నామపత్రాలు దాఖలు చేయనున్నారు.




# ఓటర్లే దొరకడం లేదు: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ అన్నారు. జలవిహార్‌లో ఏర్పాటు చేసిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడ్వొకేట్ ట్రస్ట్‌ను రూ.500 కోట్లకు పెంచుతాం, న్యాయవాదులకు వైద్య బీమాను కూడా పెంచుతామని ప్రకటించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో న్యాయవాదుల సేవలను కొనియాడారు. విద్యార్థులతో సమానంగా న్యాయవాదులు పోరాడారని కితాబిచ్చారు. “హైదరాబాద్‌లో ఉంటే.. అమెరికాలో ఉన్నట్టు ఉందని రజినీకాంత్ అన్నారు. హైదరాబాద్‌లోనే ఇల్లు కొనుక్కోవాలని అనిపిస్తోందని భాజపా ఎంపీ సన్నీ దేవోల్ అన్నారు. హైదరాబాద్‌లో అభివృద్ధి అందరికీ కనిపిస్తోంది గానీ.. విపక్షాలకు కనిపించట్లేదు. కేసీఆర్ మళ్లీ గెలవకపోతే పెరుగుతున్న హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుంది. కేసీఆర్‌ను ఓడించడానికి అందరూ ఏకమవుతున్నారు. కేసీఆర్ సింహం లాంటి వారు.. సింగిల్‌గానే వస్తారు. తెలంగాణ సీఎం ఎవరు అనేది ప్రజలు నిర్ణయించాలి.. మోదీ, రాహుల్ కాదు. ఈ పోరాటం దిల్లీ దొరలకు.. తెలంగాణ ప్రజలకు మధ్యే జరుగుతోంది. తెలంగాణ ప్రజలకు పోరాటం కొత్త కాదు. గతంలో నెహ్రూ, ఇందిరతోనూ కొట్లాడారు. అప్పుడు సోనియాతో.. ఇప్పుడు మోదీతో కొట్లాడుతున్నాం. కాంగ్రెస్‌లో సీఎంలు దొరికారు.. కానీ, ఓటర్లు దొరకడం లేదు. జానారెడ్డి ఎన్నికల్లో పోటీ చేయరు.. కానీ, సీఎం పదవి కావాలి. తెలంగాణలో సమ్మిళిత వృద్ధి ఉంది. రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు రూ.10లక్షల కోట్లకు చేరుకున్నాయి. 24వేల కొత్త పరిశ్రమలు తెలంగాణకు వచ్చాయి. 70లక్షల మంది రైతులకు రైతు బంధు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే. హైదరాబాద్‌లో పెట్టాలనుకున్న ఫాక్స్‌కాన్ సంస్థను కర్ణాటకలో పెట్టాలని, తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని డీకే శివకుమార్ ఆ సంస్థకు లేఖ రాశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో పరిశ్రమలన్నీ కర్ణాటకకు పోతాయి” అని మంత్రి కేటీఆర్ విమర్శించారు.

# ఎల్బీ స్టేడియంలో భాజపా బీసీ బహిరంగ సభ.. హాజరుకానున్న ప్రధాని మోదీ



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారైంది. నవంబరు 7న రాష్ట్రానికి ప్రధాని రానున్నారు. హైదరాబద్ ఎల్బీ స్టేడియంలో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ సభలో పాల్గొననున్నారు. ప్రధాని దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో 7న సాయంత్రం 5.05 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఎల్బీ స్టేడియానికి వచ్చి.. 5.30 నుంచి 6.10 గంటల వరకు బీసీ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తారు. సభ ముగించుకుని 6.35కి బేగంపేట విమానాశ్రయం నుంచి తిరిగి దిల్లీకి పయనమవుతారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించే సభను భాజపా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

లక్ష మందితో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. సభ ఏర్పాట్లను భాజపా ప్రతినిధుల బృందం పరిశీలించింది.

# పేరు గొప్ప ఊరు దిబ్బ లెక్క దొరగారి కమీషన్ల కాళేశ్వరం దుస్థితి



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగడంపై వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. “పేరు గొప్ప ఊరు దిబ్బ లెక్కుంది దొరగారి కమీషన్ల కాళేశ్వరం దుస్థితి. నా రక్తం, నా చెమట అని కల్లబొల్లి మాటలు చెప్పి.. కట్టింది ప్రాజెక్ట్ కాదు పేక మేడ అని బయట పడ్డది. తెలంగాణ ప్రజల సంపద 1.27 లక్షల కోట్లు ఎందుకు ఖర్చు పెట్టినట్లు? ఏం ఉద్ధరించినట్లు? మేడిగడ్డ బ్యారేజ్ పై డ్యామ్? సేఫ్టీ అథారిటీ ఇచ్చిన రిపోర్టు. మీ మెగా అవినీతికి,మెగా పనితనానికి నిదర్శనం. వందల ఏళ్లు చెక్కు చెదరకుండా ఉండాల్సిన బ్యారేజ్‌లు.. కట్టిన నాలుగేళ్లకే ముక్కలైన ఘనత ప్రపంచలోనే మన మెగా కేసీఆర్ కే దక్కింది” అంటూ వైఎస్సార్టీపీ చీఫ్ ఎద్దేవా చేశారు. 80 వేల పుస్తకాలు చదివిన దొర మెగా ఇంజినీరింగ్ పనితనం ప్రపంచానికి తెలిసిందన్నారు. లోపాలు కళ్లముందు కొట్టొచ్చినట్లు కనపడుతుంటే.. దొర లక్ష కోట్ల దోపిడీ జనాలకు అర్థమైతుంటే.. బీటలు బారడం కామనట... నెర్రెలు రావడం సహజమట అంటూ మండిపడ్డారు. ఇంతకాలం జనాలను మభ్యపెట్టింది చాలు కేసీఆర్ అని అన్నారు. తమరి దోపిడీ పాపం పండిందని.. అవినీతికి కాలం చెల్లిందన్నారు. తిన్నదంతా కక్కించే దాకా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై వెంటనే ఒక దర్యాప్తు కమీషన్‌ను వేయాలని.. జరిగిన అవినీతిపై విచారణ తక్షణం చేపట్టాలని మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# ఆదివాసీల సమగ్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి : మంత్రి సత్యవతి

తెలంగాణలోని గిరిజనులు, ఆదివాసీల సమగ్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ఓ ఫంక్షన్ హాలులో బంజారా సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ములుగును అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని.. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్, సౌభాగ్యలక్ష్మి కింద రూ.3వేలు ఇవ్వడంతో పాటు తెల్లరేషన్‌కార్డు దారులకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలో బంజారాలకు చేసిందేమీలేదని, మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అంటూ విమర్శించారు. కాంగ్రెస్ వస్తే కర్నాటక తరహాలోనే కరెంటు కష్టాలు తెలంగాణలో పునరావృతమవుతాయన్నారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని.. అక్కడ ఐదుగంటల కరెంటు ఇస్తున్నారన్నారు. తెలంగాణలో 3గంటల పార్టీ కరెంటు చాలని పీసీసీ అధ్యక్షుడు అంటున్నాడన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ 24గంటల పాటు రైతాంగానికి ఉచిత విద్యుత్‌ను అందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. రైతులపై ఉన్న ప్రేమ, చిత్తశుద్ధితో సీఎం కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

ఆ పార్టీకి మాత్రం రైతులపై ఎలాంటి మమకారం, చిత్తశుద్ధి లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో తండాలను జీపీలుగా చేసిన నేత సీఎం కేసీఆర్ అన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో లంబాడా జాతికి ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు బీజేపీ అన్యాయం చేసిందని మండిపడ్డారు. మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేదని, పదేళ్లపాటు గిరిజన యూనివర్సిటీ ఇవ్వకుండా కాలయాపన చేసి ద్రోహం చేసిందన్నారు. నీళ్ల కోసం కిలోమీటర్లు నడిచిన పరిస్థితి నుంచి తెలంగాణ వచ్చిన తర్వాత స్వయం పాలన దిశగా అడుగులు పడ్డాయన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతిని ప్రజలు ఆశీర్వదించి.. భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.




# రాములమ్మకు రేవంత్ రెడ్డి బంపరాఫర్

## రేపోమాపో కండువా కప్పుకోవడమే ఆలస్యమట!!

ఫైర్ బ్రాండ్, బీజేపీ మహిళా నేత విజయశాంతి అలియాస్ రాములమ్మ డైలమాలో ఉన్నారా..? కమలం పార్టీలో కొనసాగాలా లేకుంటే కండువా మార్చేయాలా..? అనేదానిపై ఆలోచనలో పడ్డారా..? ఎన్నికల ముందు కీలక నిర్ణయమే రాములమ్మ తీసుకోబోతున్నారా..? అంటే తాజా పరిణామాలను బట్టి చూస్తే అక్షరాలా ఇదే నిజమనిపిస్తోంది. ఎందుకంటే.. గత కొన్నిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. బీజేపీ తీరుతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. అందుకే పార్టీతో అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. సరిగ్గా ఈ పరిస్థితుల్లో కాషాయం కండువా తీసేస్తారని గట్టిగానే టాక్ నడుస్తోంది. పక్కాగా పార్టీ మారుతారని పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నప్పటికీ ఖండించిన దాఖలాల్లేవ్.

కనీసం సోషల్ మీడియా వేదికగా కూడా రియాక్ట్ కాలేదు. పైగా.. బీజేపీని తిట్టినట్లే, వ్యతిరేకించినట్లే పరోక్షంగా ట్వీట్లు చేస్తుండటం ఈ వార్తలకు మరింత బలం చేకూరుతోంది.

**అసలేం జరుగుతోంది..?** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీకి వరుసగా ఎదురుదెబ్బలే తగులుతున్నాయి. అభ్యర్థులను ఇంతవరకూ పూర్తిగా ప్రకటించకపోవడం, కనీసం మేనిఫెస్టోను కూడా రిలీజ్ చేయకపోవడం.. మరోవైపు.. పార్టీలో ఉన్న ముఖ్య, సీనియర్ నేతలు కూడా పోటీ నుంచి తప్పుకోవడంతో.. పార్టీ శ్రేణులు గందరగోళంలో పడ్డాయి. దీనికి తోడు ఒక్కొక్కరుగా సీనియర్లు, ముఖ్య నేతలంతా పార్టీకి దూరం అవుతుండటంతో బీజేపీలో అసలేం జరుగుతోందో తెలియని పరిస్థితి. అదేదో.. ‘ ఇక్కడ హ్యాండ్ ఇవ్వబడును’ అని ‘కమలవనం’లో బోర్డు పెట్టుకున్నట్లుగా ఒకరి తర్వాత ఒకరు బీజేపీకి రాజీనామా చేసేస్తున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి .. అంతకుముందు పలువురు ముఖ్య నేతలు కాషాయ పార్టీకి టాటా చెప్పేశారు. వారంతా కాంగ్రెస్ గూటికి చేరిపోయారు కూడా. ఇప్పుడు ఇదే బాటలో మరో ఇద్దరు కీలక నేతలు ఉన్నట్లు సమాచారం. అందులో ఒకరు విజయశాంతి.. మరొకరు బిగ్ షాట్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి. దీంతో నెక్స్ట్ ఎవరు..? ఎవరెప్పుడు పార్టీకి గుడ్ బై చెబుతారో ఏమోనని రాష్ట్ర నాయకత్వం సైతం ఆందోళనలో ఉన్న పరిస్థితట.

**రాములమ్మ రూటెటు..!** ఎన్నికల ముందు రాజకీయ భవిష్యత్తుపై రాములమ్మ కీలక నిర్ణయమే తీసుకోనుందని తెలుస్తోంది. రెండ్రోజుల క్రితం.. కేసీఆర్ నుంచి తెలంగాణను కాపాడుకునేందుకు కొందరు కాంగ్రెస్‌లో చేరాలని కోరుతున్నారని.. మరికొందరు బీజేపీలోనే ఉండమంటున్నారని ట్వీట్‌లో రాసుకొచ్చారు. అయితే ఇద్దరి అభిప్రాయం తెలంగాణ మేలు కోసమేనని.. సినిమాల్లో లాగా రాజకీయాల్లో డబుల్ యాక్షన్ కుదరదని ట్వీట్ చేశారు. దీంతో అసలు ఆమె ఏం చెప్పదలుచుకుంటున్నారనే విషయం ఎవరికీ అర్థం కాలేదు. ఈ పరిస్థితుల్లో బీజేపీలో ఉంటారా.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటారా..? అనేది ప్రశ్నార్థకంగానే మారింది. పైగా ఇప్పటి వరకూ మూడు జాబితాలను బీజేపీ రిలీజ్ చేసినప్పటికీ ఇందులో రాములమ్మ పేరు లేదు. రాములమ్మ కచ్చితంగా కండువా మార్చేస్తారనే హైకమాండ్ అభ్యర్థిగా ప్రకటించలేదనే టాక్ కూడా ఉంది. వాస్తవానికి బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా తొలగించిన నాటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు పార్టీ కార్యక్రమాల్లో విజయశాంతి పాల్గొన్న దాఖలాల్లేవ్. పైగా ఢిల్లీ నుంచి పెద్దలు మోదీ, అమిత్ షా .. కేంద్ర మంత్రులు తెలంగాణలో పర్యటించినప్పటికీ ఎక్కడా రాములమ్మ కనిపించలేదు. దీంతో రాష్ట్ర నాయకత్వం.. ఎప్పటికైనా విజయశాంతి పార్టీ మారిపోతారని అప్పుడే డిసైడ్ అయ్యిందట. అందుకే.. రాములక్కను కమలం పార్టీ.. బీజేపీని.. రాములమ్మ పట్టించుకోవట్లేదట.

**బంపరాఫర్..!** మొత్తానికి చూస్తే.. రాములమ్మ మనసులో ఏదో ఉందన్న విషయం స్పష్టంగా అర్థమవుతోంది. విజయశాంతి అసంతృప్తిగా ఉండటం, కమలం పార్టీ పట్టించుకోని పరిస్థితుల్లో కాంగ్రెస్ నుంచి.. అది కూడా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి నుంచి పిలుపు వచ్చినట్టు తెలిసింది. పార్టీలో తగిన ప్రాధాన్యంతోపాటు.. పదవి కూడా ఇస్తామని హైకమాండ్ హామీ ఇచ్చినట్టు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ టికెట్ ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు మాటిచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ హామీతో రాములమ్మ కమలం పార్టీకి రాజీనామా చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారట. ఒకట్రెండు రోజుల్లో రాజీనామా చేసి.. సోమవారం, లేదా మంగళవారం నాడు కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని తెలియవచ్చింది. ఇదే జరిగితే.. కష్టకాలంలో కాషాయ పార్టీకి పెద్ద ప్రభావమే పడుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఫైనల్‌గా ఏం జరుగుతుందో వేచి చూడాలి మరి.

# రైతుల వద్ద పైసలుంటేనే రియల్ వ్యాపారం బావుంటుంది



ఖమ్మం: రైతుల వద్ద పైసలుంటేనే రియల్ వ్యాపారం బావుంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నాడు ఏ.ఎస్.అర్ వృక్షం ఇన్‌ఫ్రాడెవలప్‌మెంట్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో తుమ్మల పాల్గొని మాట్లాడుతూ.. “వెంచర్స్‌లో వాటాల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారులను బీఆర్ఎస్ నేతలు బెదిరిస్తున్నారు. నా నలబై ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడు వ్యాపారులను ఇబ్బంది పెట్టలేదు. ఖమ్మంలో రహదారుల అభివృద్ధితో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి బాటలు వేశా. రియల్ ఎస్టేట్ రంగం బాగుండాలాంటే వ్యవసాయం పచ్చగా ఉండాలి. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్య శ్యామలం చేసేందుకు కృషి చేస్తా. రహదారులే నాగరికతకు ప్రగతి బాటలు. రహదారులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుంది. చందాలు, దందాలు లేని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలి” అని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# హనుమంతుడు అందరి వాడే పేరుతో నాజీవిత చరిత్ర పుస్తకం విడుదల చేస్తా



హైదరాబాద్: హనుమంతుడు అందరి వాడే పేరుతో నా జీవిత చరిత్ర పుస్తకం విడుదల చేస్తానని వి.హనుమంతురావు ప్రకటించారు. శనివారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ..“50 ఏళ్ల నా అనుభవంలో విద్యార్థి, యూత్ కాంగ్రెస్, పీసీసీ అధ్యక్షులుగా, కేంద్ర , రాష్ట్ర మంత్రిగా అనుభవాన్ని అంతా పుస్తకంగా రాస్తాను. వచ్చే తరం వారికి తెలియాలని ఈ బుక్ రాస్తున్నా. నాకు ముఖ్యమంత్రి అవకాశం వచ్చింది.

కానీ కొన్ని శక్తుల వల్ల పోయింది.నాతో కేసీఆర్, చంద్రబాబు పని చేశారని అనుభవాలు వచ్చే తరానికి తెలియాలి. సంజయ్ గాంధీ ఆలోచనతో ఓల్డ్ సిటీలో 50 రోజులు తిరిగాను. రాజీవ్‌గాంధీ నన్ను పీసీసీ అధ్యక్షుడుని చేశారు. నేను సహాయం చేసిన వారిపై కూడా పుస్తకంలో రాశాను. రాజకీయంగా ఎదుగుదలలో నష్టాన్ని కూడా ఆ పుస్తకంలో రాస్తాను. డిసెంబర్ 7వ తేదీన ఇందిర పార్క్ దగ్గర వెంకటరామిరెడ్డి హాల్లో పుస్తక ఆవిష్కరణ ఉంటుంది. దీనికి మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చౌహన్, కర్ణాటక మంత్రి బొసురాజు, దీపాదాస్ మున్షి ఈ కార్యక్రమానికి హాజరవుతారు. నాయకుల వెంట తిరిగితే పదవులు రావు. గ్రామాల్లో తిరగండి కష్టపడండి. పార్టీలు మారకుండా ఉన్న పార్టీలోనే ఎదగాలి. ఉన్నా పార్టీలోనే చచ్చేవరకు ఉండాలి. కేసీఆర్‌కు సెక్రటరీయట్, అంబేద్కర్ విగ్రహం సింబాలిక్‌గా ఉంది. రైతు ఆత్మహత్యలు, ముగ్గురు అమ్మాయిలపై అత్యాచారం జరిగితే అక్కడ పోరాడను. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ హన్మంతరావు ఉంటారు” అని వీహెచ్ చెప్పారు.

# బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి మద్దతివ్వాలి : హోంమంత్రి మహమూద్ అలీ

నర్సాపూర్ : బీఆర్ఎస్ నర్సాపూర్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి ముస్లింలు మద్దతు ఇవ్వాలని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పిలుపునిచ్చారు. నర్సాపూర్‌లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో, తొమ్మిది సంవత్సరాల తెలుగుదేశం పాలనలో తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో హిందూముస్లింల మధ్య నిత్యం గొడవలు జరిగేవని, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో హిందూముస్లింలు కలసిమెలసి జీవిస్తున్నారన్నారు. మిలాద్ ఉన్ నబీ, వినాయక నిమజ్జనోత్సవం ఒకేరోజు రావడంతో.. మిలాద్ ఉన్ నబీని వాయిదా వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ముస్లిం విద్యార్థుల కోసం ఎన్నో రెసిడెన్షియల్ పాఠశాలలను కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు.

విదేశాలలో చదివే పేద ముస్లిం విద్యార్థులకు రూ.20లక్షలు ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేశారన్నారు. ఇమామ్‌లకు గౌరవ వేతనం ఇచ్చి గౌరవిస్తుందని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.24 కోట్లు షాదీ ముబారక్ పథకం కింద అందజేయడం జరిగిందన్నారు. కేసీఆర్‌లాంటి మనిషి దేశంలో ఎవరూ లేరని.. కాంగ్రెస్ హయాంలో ఒక్క ముస్లిం వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ముస్లింలకు సముచితస్థానం కల్పించి గౌరవించారన్నారు. రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తని.. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడుతున్నారని విమర్శించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com